http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

మంగళవారం 24 సెప్టెంబర్ 2024

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



## కేడర్‌ను సిద్ధం చేస్తున్న రేవంత్


### స్థానిక సంస్థలకు రెడీ అవుతున్న సీఎం రేవంత్ రెడ్డి

- స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్, బీజేపీలను చావుదెబ్బ తీసి సత్తా చాటాలనుకుంటున్న రేవంత్‌రెడ్డి
- ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా పథకాలను అందిచి ప్రజల్లోకి వాటిని బలంగా తీసుకు వెళ్లే ప్రయత్నాలు
- ప్రధాన లక్ష్యం స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు సాగడంపైనే చర్చించిన సీఎల్పీ సమావేశం

హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక సంస్థలకు రెడీ అవుతున్నారు. నేతలను అందుకు సిద్ధం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్, బీజేపీలను చావుదెబ్బ తీసి సత్తా చాటాలనుకుంటున్నారు. అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే కాకుండా ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయాలన్న ఆలోచనతో రేవంత్ రెడ్డి ఉన్నారు. అందుకోసం అస్త్రశస్త్రాలను రేవంత్ సిద్ధం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా పథకాలను అందిచి ప్రజల్లోకి వాటిని బలంగా తీసుకు వెళ్లే ప్రయత్నాలను ప్రారంభించారు. అందుకోసమే రేవంత్ రెడ్డి ఈరోజు కాంగ్రెస్ శాసనసభ పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశం ప్రధాన లక్ష్యం స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు సాగడంపైనే చర్చ సాగుతుంది. తెలంగాణకు కొత్త - మిగతా3లో





## దుర్గం చెరువు వాసులకు గుడ్ న్యూస్

- బాధితుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలన్న హైకోర్టు
- దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిపై ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశం
- వారంలోపు అభ్యంతరాలు చెప్పాలని బాధితులకు సూచన
- ఆరు వారాల్లోగా ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ధారించాలన్న హైకోర్టు

హైదరాబాద్

దుర్గం చెరువు పరిసర ప్రాంతాల్లో నివాసితులకు హైకోర్టులో ఊరట లభించింది. దుర్గం చెరువు పరిసర ప్రాంతాల్లో కూల్చివేతలపై న్యాయస్థానం స్టే ఇచ్చింది. అలాగే అక్టోబర్ 4 వ తేదీన లేక్ ప్రోటక్షన్ ముందు హాజరు కావాలని నిర్వాసితులకు ఆదేశించింది. 2014లో జారీ చేసిన ప్రిలిమినరీ నోటిఫికేషన్‌పై దుర్గం చెరువు నిర్వాసితులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో నిర్వాసితుల అబ్జెక్షన్స్‌పై లేక్ ప్రొటెక్షన్ కమిటీ పరిగణలోకి - మిగతా3లో

## వరద బాధితులకు సూపర్ స్టార్ మహేశ్ విరాళం



- ఇప్పటికే ఆయన ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెరో రూ.50లక్షల చొప్పున ప్రకటించారు.
- సీఎం రేవంత్ రెడ్డిని కలిసి దానికి సంబంధించిన రూ.50లక్షల చెక్కును అందజేసిన మహేష్ బాబు
- అలాగే ఏఎంబీ మాల్ తరపున మరో రూ.10లక్షలు అందజేత

హైదరాబాద్

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా కురిసిన భారీ వర్షాలకు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు తీవ్రంగా నష్టపోయిన సంగతి తెలిసిందే. అయితే వారిని ఆదుకునేందుకు సినీ హీరో, సూపర్ స్టార్ మహేశ్ బాబు ముందుకు వచ్చారు. ఇప్పటికే ఆయన ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెరో - మిగతా3లో



## పని ఒత్తిడి నిర్వహణ మీద బోధన జరగాలి

- పని ఒత్తిడిపై నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలు... మండిపడిన కాంగ్రెస్
- పని ఒత్తిడితో పాటు ఒత్తిడి నిర్వహణ బోధన జరగాలన్న నిర్మలా సీతారామన్
- కార్పోరేట్లకు ఇబ్బంది వచ్చినప్పుడే ఆర్థికమంత్రి పట్టించుకుంటారని కాంగ్రెస్ విమర్శ
- పని విధానం, సుదీర్ఘ పని గంటలు వంటి అంశాల గురించి మాట్లాడాలన్న శివసేన

## హైడ్రా దూకుడు!

- ప్లస్ అవుతుందా... మైనస్ అవుతుందా
- రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హైడ్రాకు మరింత బలాన్ని చేకూర్చింది.
- ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో అక్రమంగా నిర్మించిన వారి గుండెల్లో హైడ్రా దడ పుట్టిస్తోంది
- ప్రభుత్వానికి వెయ్యి ఎకరాలకు పైగా భూమిని రికవరీ చేశారు
- పేద, ధనిక అనే తేడా లేకుండా అందరినీ ఒకే తీరులో చూస్తే అక్రమ కట్టడాలు కనిపిస్తే వాటిని కూల్చుతూ ముందుకు సాగుతోంది.
- ఇక నుంచి హైడ్రా ఆపరేషన్స్ కోసం 150 మంది అధికారులతోపాటు 964 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందిని కేటాయింపు



హైదరాబాద్

హైదరాబాద్ మహానగరం, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోని చెరువులను, కుంటలను, నాలాలను, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు చేసింది. దీనికి సీనియర్ ఐపీఎస్ రంగనాథ్‌ను కమిషనర్‌గా నియమించింది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో అక్రమంగా నిర్మించిన వారి గుండెల్లో హైడ్రా దడ పుట్టిస్తోంది. హైడ్రా వ్యవస్థ ఏర్పాటు నుంచే దూకుడుగా వెళ్తోంది. అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది. ఇప్పటివరకు అలా.. వందలాది నిర్మాణాలను కూల్చివేయగా.. ప్రభుత్వానికి వెయ్యి ఎకరాలకు పైగా భూమిని రికవరీ చేశారు. పేద, ధనిక అనే తేడా లేకుండా అందరినీ ఒకే తీరులో చూస్తే అక్రమ కట్టడాలు కనిపిస్తే వాటిని కూల్చుతూ ముందుకు సాగుతోంది. ఇప్పటివరకు ఎలాంటి సిబ్బంది, - మిగతా3లో

## శాంతిభద్రతల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది



- రాష్ట్రంలో ప్రజా పాలన కాదు.. గూండా రాజ్యం నడుస్తుంది
- కాంగ్రెస్ నాయకత్వం ప్రోత్సాహంతో జరిగిన దాడి
- పోలీసులపై దాడి జరిగినా కేసు నమోదు చేయడం లేదు..
- కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి శాశ్వతం కాదు..
- పోలీసుల అత్యుత్సాహం వల్ల ఆంధ్రప్రదేశ్‌లో ఏం జరిగిందో చూశాం
- తెలంగాణలో అత్యాచారాలు, గూండాయిజం పెరిగాయని ఆరోపణ
- శాంతిభద్రతల విషయంలో ప్రభుత్వం విఫలమైందన్న హరీశ్ రావు
- సునీతా లక్ష్మారెడ్డి నివాసంపై దాడులు చేశారని ఆగ్రహం
- రేవంత్ రెడ్డి హైడ్రా పేరుతో సమస్యలను డైవర్ట్ చేస్తున్నారన్న మాజీ మంత్రి

మెదక్

అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదు... పోలీసుల అత్యుత్సాహం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏం జరిగిందో మనం చూశామని, పోలీసు అధికారులు చట్టాలకు లోబడి పని చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్రంలో గూండాయిజం, అత్యాచారాలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలోనే 2 వేలకు పైగా అత్యాచారాలు జరిగాయని విమర్శించారు. శాంతిభద్రతల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ రాష్ట్రంలో ప్రజా పాలన కాదు.. గూండా రాజ్యం నడుస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల హక్కులను పూర్తిగా కాలరాస్తుందని మండిపడ్డారు. నర్సాపూర్ గోమారంలోని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి నివాసంలో మాజీ మంత్రి హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. సీనియర్ శాసనసభ్యులు, మాజీ మంత్రి సునీత లక్ష్మారెడ్డి ఇంటి మీద కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. మొన్న సిద్దిపేటలో నా కార్యాలయం మీద దాడి కావచ్చు, - మిగతా3లో



## పువ్వులనే దైవాలుగా పూజించే పండుగ

- మన బతుకమ్మ పండుగ..
- మరికొద్ది రోజుల్లో తెలంగాణలో బతుకమ్మ సంబరాలు ప్రారంభం
- తెలంగాణ ఉద్యమ కాలంలో పాటకు ఎంత ప్రాధాన్యం ఉండేదో.. బతుకమ్మకు కూడా అంతే ప్రాధాన్యం ఉండేది
- వచ్చే ఈ పండుగ వేళ వర్షాలతో జలాశయాలు కళకళలాడుతుంటాయి
- రకరకాల, రంగురంగుల పువ్వులు వికసించి కనువిందు చేస్తుంటాం

# ప్రేమతోనే విద్వేషాన్ని అధిగమించగలం



**న్యూఢిల్లీ:** దేశంలో విద్వేషం, హింసను భారతీయ జనతా పార్టీ ఆ పార్టీ మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ వ్యాప్తి చేస్తున్నాయని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. వాళ్లు ఎక్కడికి వెళ్లినా కులాలు, మతాలు, రాష్ట్రాలు, భాషల మధ్య విభజనలు తెచ్చి ఘర్షణలను ప్రోత్సహిస్తారంటూ విమర్శలు గుప్పించారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పూంచ్ జిల్లాలో సోమవారంనాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ మాట్లాడుతూ, పహారి, గుజ్జర్ కమ్యూనిటీల మధ్య చీలకలు తెచ్చేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని, ఆ పార్టీ యత్నాలు విఫలమవుతాయని అన్నారు.

"ప్రేమతోనే విద్వేషాన్ని అధిగమించగలం. ఒకవైపు విద్వేష వ్యాప్తి చేస్తున్నువారు, మరోవైపు ప్రేమను ప్రమోట్ చేస్తున్నవారు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అందర్నీ కలుపుకొని వెళ్లి ప్రతి ఒక్కరి హక్కుల కోసం ముందుంటుంది. మాకు అందరూ సమానమే. ఎవరినీ వెనకబడనీయం" అని రాహుల్ చెప్పారు. జమ్మూకశ్మీర్ ప్రజలతో సహా ఎవరు ఏ పని చేయమని తనను అడిగినా అ పని చేయడానికి సిద్ధమని, ఏ సమస్యనైనా పార్లమెంటు ముందు ప్రస్తావించడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత విపక్షాల బలం పెరిగిందని, ప్రభుత్వ ప్రజావ్యతిరేక చట్టాలు, విధానాలకు వ్యతిరేకంగా విపక్షాలు ఐక్యంగా నిలుస్తాయని భరోసా ఇచ్చారు.

**మోదీలో మునుపటి కాన్ఫిడెన్స్ లేదు..**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కాన్ఫిడెన్స్ కోల్పోయారని, అది ఆయన ముఖంలో ప్రస్ఫుటంగా కనిపిస్తోందని రాహుల్ అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు చాలా ధీమాతో కనిపించేవారని, ఇప్పుడు అది మాయమైందని అన్నారు. కేంద్రంపై విసుర్లు గుప్పిస్తూ, కేంద్ర పాలిత ప్రాంతాలు అడపాదడపా రాష్ట్రాలు కావడం, రాష్ట్రాలు కొత్త రాష్ట్రాలుగా విభజన జరగడం చూశామని, అయితే జమ్మూకశ్మీర్ రాష్ట్రం రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజన కావడం మాత్రం చరిత్రలో మొదటిసారని ఆక్షేపించారు

# జగన్ ఒంటరి.... జాతీయ పార్టీల నుంచి డోర్లు క్లోజ్



**న్యూఢిల్లీ :** ఏపీ ఎన్నికల్లో ఒంటరి పోరు చేసిన వైసీపీ చారిత్రక పరాజయాన్ని మూటగట్టుకుంది. ఓటమి తర్వాత సీనియర్లు పార్టీని వీడుతూ జగన్ ఒంటరి అవుతున్నారు. ఒక వైపు అక్రమాస్తుల కేసులు , మరో వైపు పార్టీ పునర్నిర్మాణం ఆయనకు పెను సవాల్‌గా మారాయి. ఉన్న కష్టాలకు తోడు శ్రీవారి లడ్డు వివాదం వైసీపీ మెడకు చుట్టుకుని ఆ పార్టీ ప్రతిష్టను మరింత దిగజారుస్తుంది. ఆ ఎఫెక్ట్‌తో జగన్ జాతీయ స్థాయిలో ఎవరి సపోర్ట్ లేకుండా ఒంటరి అయ్యే పరిస్థితి కనిపిస్తుంది. అదెలా అంటారా? మీరే చూడండి.సింహం సింగిల్‌గా వస్తుంది. ఆ సినిమా డైలాగ్‌ని వైసీపీ అధ్యక్షుడు జగన్ సైన్యం పదేపదే రిపీట్ చేస్తుంటుంది. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే జగన్ నిజంగానే ఒంటరి అయిపోతున్నట్లు కనిపిస్తుంది. రాష్ట్రంలో సీనియర్లు ఒకరొకరుగా గుడ్ బై చెపుతుండటంతో జగన్‌కు సీనియర్ పొలిటీషియన్లు కరువై.. సలహాదారులే మిగులుతారన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.అటు జాతీయ స్థాయిలోనూ ఇప్పుడున్న పరిస్థితుల్లో జగన్‌ను సపోర్ట్ చేసే పార్టీ కనిపించడం లేదు.. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించిపోతున్నాయని ఆరోపిస్తూ జగన్ ఢిల్లీ వెళ్లి ధర్నా చేశారు. అప్పుడాయనకు ఇండియా కూటమిలోని పెద్ద పార్టీలేవి మద్దతు పలకలేదు. జగన్‌కు కేంద్రంలో ఎన్డీయే కూటమి డోర్లు ఫ్రీజ్ అయిపోయిన పరిస్థితుల్లో.. ఆయన అప్పట్లో ఇండియా కూటమి తనకు మద్దతిస్తుందని భావించారు. అయితే అది జరగలేదు.తాజాగా వైసీపీ శ్రీవారి లడ్డులో కల్తీ నెయ్యి వ్యవహారానికి సంబంధించి ఉక్కిరిబిక్కిరి అవుతుంది. జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఆ మహాపరాధంపై హిందూ సమాజమంతా భగ్గు మంటుంది. దాన్ని డిఫెండ్ చేసుకోవడానికి వైసీపీ నానా పాట్లూ పడుతుంది. అధికారంలో ఉన్నప్పుడు కేంద్రంలోని ఎన్డీఏ సర్కారుతో రహస్యంగా అంటకాగిన జగన్‌కు ఇప్పుడా పరిస్థితి లేదు. అందుకే ఆయన ఓటమి తర్వాత ఇండియా కూటమి వైపు చూశారుఅయితే ఇండియా కూటమిలో జగన్‌కి సొంత చెల్లెలు షర్మిలే పెద్ద స్పీడ్ బ్రేకర్‌గా మారారు. ఏపీలో బలోపేతం అవ్వాలని చూస్తున్న కాంగ్రెస్ ముున్ముందు షర్మిలకు ప్రాధాన్యత తగ్గించి వైసీపీని విలీనం చేసుకోవడమూ? లేకపోతే కూటమిలో చేర్చుకోవడమో? చేస్తుందని భావించినా ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. శ్రీవారి లడ్డూ వివాదం జగన్ మెడకు చుట్టుకోవడంతో.. ఇండియా కూటమి ఆయన్ని చేర్చుకోవడం కాదు కదా.. కనీసం ఆ కూటమి పెద్దలు ఆయనకు అపాయింట్‌మెంట్ ఇచ్చే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ఇప్పుడిప్పుడే పుంజుకుంటూ బీజేపీకి సవాలుగా మారుతున్న కాంగ్రెస్ పార్టీ వైసీపీని దగ్గర రానిచ్చే పరిస్థితే లేదు. త్వరలో అయిదు రాష్ట్రాల ఎన్నికలు జరగనున్నాయి. ఒకవైపు చూస్తే శ్రీవారి లడ్డూ వివాదంతో రాజకీయాలకు అతీతంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులంతా వైసీపీపై ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ వైసీపీ షేక్‌హ్యాండ్ ఇస్తే.. ఏం జరుగుతుందో ఆ పార్టీకి తెలియంది కాదువచ్చే 2029 నుంచి మన దేశంలో జమిలి ఎన్నికలు జరుగుతాయంటున్నారు. జమిలి ఎన్నికలు జరగడం అంటే దేశవ్యాప్తంగా కీలకమైన ప్రధాన జాతీయ పార్టీల ప్రాబల్యమే ఎన్నికలలో ఎక్కువగా కనిపిస్తుంది. అప్పుడు ప్రాంతీయ పార్టీలు అన్నీ తమ మనుగడకు ఏదో ఒక కూటమిని ఆశ్రయించాల్సి ఉంటుంది.. అయితే జగన్‌కి ఎన్డీఏ డోర్లు క్లోస్ అయిపోయాయి ఇప్పుడు హిందుత్వ సెటిమెంట్‌తో ఇండియా కూటమి గేట్లు ముట్టుకునే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ఓవరాల్‌గా వైసీపీ సింగిల్‌గా మిగిలిపోవడం ఖాయమైంది.

## మణిపూర్‌లో డెంగ్యూ విజృంభణ.. ఇప్పటి వరకూ 448 కేసులు నమోదు



ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో డెంగ్యూ విజృంభిస్తోంది. గత నెల రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా డెంగ్యూ కేసులు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఈ వైరస్ కారణంగా వెస్ట్ ఇంఫాల్ జిల్లాలో ఓ మరణం కూడా సంభవించింది. సెప్టెంబర్ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఏకంగా 448 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. అందులో ఇంఫాల్ వెస్ట్‌లో అత్యధికంగా 259 కేసులు వెలుగు చూశాయి. ఇక ఇంఫాల్ ఈస్ట్ లో 117 కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సపమ్ రంజన్ సింగ్ కూడా ధ్రువీకరించారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆగస్టులో 148 కేసులు నమోదైనట్లు చెప్పారు. సెప్టెంబర్ 13 నాటికి ఆ సంఖ్య 230కి పెరిగిందన్నారు. డెంగ్యూ వ్యాప్తిని అరికట్టేందుకు అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. డెంగ్యూ నివారణకు ఆరోగ్య శాఖ సిద్ధంగా ఉందన్నారు. ఓ వ్యక్తికి డెంగ్యూ పాజిటివ్ తేలితే అతను ఉన్న 100 మీటర్ల పరిధిలో ఫాగింగ్ చేస్తున్నట్లు చెప్పారు. అయితే, సమాజ భాగస్వామ్యం లేకుండా ఇన్‌ఫెక్షన్‌ను నియంత్రించడం కష్టమన్నారు. డెంగ్యూ దరిచేరకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పూల కుండీలతోపాటు తమ ఇళ్లలో, చుట్టుపక్కల నీరు నిలవకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డెంగ్యూపై పోరాటంలో దోమల ఉత్పత్తి కేంద్రాలను నిర్మూలించడమే కీలకమని చెప్పారు. ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ డేటా ప్రకారం.. గతేడాది మణిపూర్ వ్యాప్తంగా 2,548 డెంగ్యూ కేసులు వెలుగు చూశాయి. ఇందులో ఇంఫాల్ వెస్ట్‌లో 1,639 కాగా, ఇంఫాల్ ఈస్ట్‌లో 521 కేసులు నమోదయ్యాయి. అయితే అప్పుడు ఒక్క మరణం కూడా సంభవించలేదు.

# మేం నాలుగోసారి అధికారంలోకి వస్తామన్న హామీ ఇవ్వలేను కానీ

**తోటి మంత్రిపై నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు**



తోటి కేబినెట్ మంత్రి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఏ) చీఫ్ రామ్‌దాస్ అథవాలేని ఉద్దేశించి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వం (ఎన్డీయే) నాలుగోసారి అధికారంలోకి వస్తుందో రాదో తెలియదు కానీ.. ఆయన మాత్రం మరోసారి మంత్రి అవుతారంటూ వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర నాగ్‌పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో స్టేజ్‌పై అథవాలే కూడా ఉండటం గమనార్హం. 'మా ప్రభుత్వం నాలుగోసారి అధికారంలోకి వస్తుందని హామీ ఇవ్వలేను.. కానీ రాందాస్ అథవాలే మాత్రం మంత్రి అవుతారని ఖచ్చితంగా హామీ ఇవ్వగలను' అంటూ చమత్కరించారు. ఇది జోక్ మాత్రమే అంటూ చెప్పుకొచ్చారు. ఆ సమయంలో స్టేజ్‌పై ఉన్న అథవాలే సరదాగా నవ్వులు చిందించారు. ప్రస్తుతం గడ్కరీ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. కాగా, రామ్‌దాస్ అథవాలే వరుసగా మూడుసార్లు కేంద్ర మంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే తన పరంపరను కొనసాగిస్తానని ఈ సందర్భంగా విశ్వాసం వ్యక్తం చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికల వేళ పంజాబ్ సీఎం సంచలన నిర్ణయం



**పంజాబ్ :** న్యూఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ నేతృత్వంలో అతిషి ముఖ్యమంత్రిగా కొత్త ప్రభుత్వం కొలువు తీరింది. ఆ కొన్ని గంటలకే పంజాబ్ ముఖ్యమంత్రి, ఆప్ నేత భగవంత్ మాన్ సైతం తన కేబినెట్‌ను పునర్ వ్యవస్థీకరించేందుకు చర్యలు చేపట్టారు. అందులోభాగంగా ఐదుగురు కొత్త వారిని ఆయన తన కేబినెట్‌లోకి తీసుకోంటున్నారు. సోమవారం రాజ్‌భవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో వీరి చేత గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అలాగే ప్రస్తుతం మాన్ కేబినెట్‌లోని నలుగురు మంత్రులను సీఎం మాన్ తొలగించనున్నారు. కొత్తగా మాన్ కేబినేట్‌లో చోటు దక్కించుకున్న ఎమ్మెల్యేలు.. బిరిందర్ కుమార్ గోయల్, డాక్టర్ రాజివట్, తరణ్ ప్రీత్ సింగ్, మహిందర్ భగత్, హర్దీప్ సింగ్‌లను సీఎం మాన్ కాగా.. ఇక చేతన్ సింగ్, శంకర్ జింపా, బల్కర్ సింగ్, అన్మోల్ గగన్ మాన్‌లు కేబినెట్ నుంచి ఉద్వాసన పొందుతున్నారు. మరికొద్ది రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం భగవంత్ మాన్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం సీఎం భగవంత్ సింగ్ మాన్ కేబినెట్‌లో ఆయనతో కలిపి 15 మంది ఉన్నారు. మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ వ్యవహారంలో అరెస్టయిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాలకు సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ముఖ్యమంత్రి హోదాలో ఎక్కడ సంతకం చేయకూడదంటూ సీఎం కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు షరతు విధించింది. ఈ నేపథ్యంలో సీఎం పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. దీంతో సీఎం పదవికి అతిషిని ఆమ్ ఆద్మీ పార్టీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. దీంతో ఢిల్లీ సీఎంగా అతిషి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆమెతోపాటు మరో ఐదుగురు ఎమ్మెల్యేలు ఆమె కేబినెట్‌లో మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇక ఢిల్లీ సీఎంగా అతిషి .. సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు. న్యూఢిల్లీలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీలో ఈ పరిమాణామాలు చోటు చేసుకున్న కొన్ని గంటలకే పంజాబ్‌లోని అధికార ఆమ్ ఆద్మీ పార్టీలో సైతం దాదాపుగా అదే తరహా ఘటనలు చోటు చేసుకోవడం గమనార్హం.

## ఆది పోక్సో నేరమే

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు ఇవాళ కీలక తీర్పును ఇచ్చింది. చిన్నారులకు సంబంధించిన పోర్న్ వీడియోలను డౌన్ లోడ్ చేయడం కానీ, వీక్షించడం కానీ.. పోక్సో చట్టం కిందకు వస్తాయని అత్యున్నత న్యాయస్థానం పేర్కొన్నది. చిన్నారులపై లైంగిక వేధింపులను అడ్డుకునే చట్టానికి సంబంధించిన విషయంలో సుప్రీం ధర్మాసనం ఈ తీర్పు చెప్పింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పర్దివాలాతో కూడిన ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది. చైల్డ్ పోర్న్ వీడియోలను డౌన్‌లోడ్ చేయడం కానీ, వీక్షించడం కానీ పోక్సో నేరం కాదు అని మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఆ తీర్పును ఇవ్వడంలో మద్రాసు కోర్టు తీవ్రమైన తప్పు చేసినట్లు సుప్రీం ధర్మాసనం వెల్లడించింది. 28 ఏళ్ల ఓ వ్యక్తి చైల్డ్ పోర్న్ వీడియోలను తన మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసిన కేసులో మద్రాసు హైకోర్టు ఈ తీర్పును ఇచ్చింది. ఆ వ్యక్తిపై నేరాభియోగాన్ని కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. దాన్ని ఇవాళ సుప్రీంకోర్టు రిస్టోర్ చేసింది. ఆ వ్యక్తిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సుప్రీం తన ఆదేశంలో పేర్కొన్నది.

## పని ఒత్తిడి నిర్వహణ మీద బోధన జరగాలి



విద్యార్థులకు విద్యను అందించడంతో పాటు పని ఒత్తిడి నిర్వహణ మీద బోధన జరగాల్సి ఉందని, సీఏ చదివిన యువతి పని ఒత్తిడిని భరించలేకపోయిందన్న వార్త తనను కలచివేసిందన్నారు. అయితే నిర్మలా సీతారామన్ ఏ కంపెనీ పేరు, యువతి పేరును ప్రస్తావించలేదు. కానీ ఇటీవల యర్నెస్ట్ యంగ్ ఇండియా ఉద్యోగి మరణాన్ని ఉద్దేశిస్తూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. విద్యార్థులకు విద్యతో పాటు పని ఒత్తిడిని జయించడం కూడా విద్యా సంస్థలు బోధించాలన్నారు. ఆమె వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. క్షీణిస్తున్న పని పరిస్థితుల గురించి మాట్లాడకుండా... పని ఒత్తిడిని జయించడం గురించి మాట్లాడటం సరికాదని కాంగ్రెస్ పేర్కొంది. కార్పోరేట్లకు ఇబ్బంది వచ్చినప్పుడే ఆర్థికమంత్రి పట్టించుకుంటారని, కార్పోరేట్ శ్రమ దోపిడీకి గురైన అన్నాసెబాస్టియన్ వంటి వారి బాధలు పట్టవని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విమర్శించారు. బాధితురాలికి, ఆమె కుటుంబానికి అండగా నిలవాల్సింది పోయి... ఆమెదే తప్పన్నట్లుగా మాట్లాడటం సరికాదన్నారు. క్లిష్టమైన కోర్సుల్లో ఒకటైన చార్టర్డ్ అకౌంటెన్సీ చేసిన యువతికి పని ఒత్తిడి గురంచి చెప్పాల్సిన అవసరం లేదని శివసేన (యూబీటీ) నేత ప్రియాంక చతుర్వేది మండిపడ్డారు. పని విధానం, సుదీర్ఘ పని గంటలు వంటి అంశాల గురించి ఆర్థికమంత్రి మాట్లాడాలని హితవు పలికారు. సన్నిత అంశాల పట్ల ఆచితూచి మాట్లాడాలన్నారు.

## మిస్ యూనివర్స్‌గా రియా


**జైపూర్ :** మిస్ యూనివర్స్ ఇండియా 2024 కిరీటాన్ని రియా సింఘా దక్కించుకుంది. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన మిస్ యూనివర్స్ ఇండియా 2024 గ్రాండ్ ఫినాలో రియా విజేతగా నిలిచి ప్రతిష్టాత్మక టైటిల్‌ను కైవలం చేసుకుంది. దీంతో రియా ఇప్పుడు ప్రపంచ మిస్ యూనివర్స్ 2024 పోటీలో భారత్ తరఫున బరిలో నిలచే అవకాశాన్ని దక్కించుకుంది.ఈ విజయాన్ని అందుకున్న తర్వాత రియా ఆనందానికి హద్దులు లేకుపోయాయి. ఈ కిరీటాన్ని అందుకున్న తర్వాత మీడియాతో మాట్లాడిన ఆమె తన సంతోషాన్ని పంచుకుంది. మిస్ యూనివర్సట్ ఇండియా టైటిల్‌ను గెలుచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపింది. తాను ఈ స్థాయికి చేరుకోవడానికి ఎంతో కష్టపడ్డానని, ఇంతకు ముందుకు విజేతలుగా నిలిచిన వారి నుంచి చాలా నేర్చుకున్నాని రియా చెప్పుకొచ్చింది.ఇక ఈ ఈవెంట్‌కు న్యాయనిర్ణేతగా నటి, మిస్ యూనివర్స్ ఇండియా 2015 ఊర్వి రౌటేలా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "ఈ సంవత్సరం భారతదేశం మళ్లీ మిస్ యూనివర్స్ కిరీటాన్ని గెలుచుకుంటుంది" అని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక వాస్ మియూనిర్స్ పోటీలో ఈ ఏడాది భారత దేశానికి మిస్ యూనివర్స్ కిరీటం కచ్చితంగా వస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. అలాగే.. మిస్ యూనివర్స్ ఇండియా పోటీలో అమ్మాయిలుందరూ చాలా కష్టపడ్డారని, వారి అంకితభావం అద్భుతమని రౌటేలా కొనియాడారు

## కేజ్రీవాల్ సీటును అలానే ఉంచి.. సీఎం బాధ్యతలు చేపట్టిన అతిషి



**న్యూఢిల్లీ:** అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో ముఖ్యమంత్రిగా 'ఆప్' నేత అతిషి సోమవారంనాడు బాధ్యతలు స్వీకరించారు. పార్టీ చీఫ్ కేజ్రీవాల్ కూర్చునే సీటును ఖాళీగానే ఉంచి, ఆ పక్కనే వేరే కుర్చీలో కూర్చుని విధులు నిర్వహించారు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా తాను ఈరోజు బాధ్యతలు చేపట్టానని, 14 ఏళ్ల పాటు రాముడు అరణ్యవాసం చేసిన సమయంలో అయోధ్య పాలన సాగించినప్పుడు భరతుడి మనోగతం ఎలాగ ఉందో తాను కూడా అలాంటి ఫీలింగ్‌తోనే ఉన్నట్టు చెప్పారు. రాముడి పాదుకలు సింహాసనంపై ఉంచి భరతుడు ఎలా పాలన చేశారో అదే విధంగా రాబోయే నాలుగు నెలలు తాను ఢిల్లీ ప్రభుత్వ పాలన సాగిస్తానని తెలిపారు. 'కేజ్రీవాల్ తన రాజీనామాతో రాజకీయాల్లో హుందాగా ఎలా వ్యవహరించాలనే దానికి ఉదాహరణగా నిలిచారు. ఆయన ఇమేజ్‌ను దెబ్బతీయడానికి బీజేపీ చేయని ప్రయత్నం అంటూ లేదు. ఆయనపై తప్పుడు కేసులు బనాయించి ఆరు నెలల పాటు జైలులో ఉంచింది. ఫిబ్రవరి ఎన్నికల్లో తిరిగి కేజ్రీవాల్‌ను ప్రజలు గెలిపించుకుంటారని నమ్ముతున్నాను. అప్పటివరకూ ఆయన సీటు ఖాళీగానే ఉంటుంది" అని అతిషి చెప్పారు. కేజ్రీవాల్ ప్రభుత్వంలో విద్య, రెవెన్యూ, ఆర్థికం, విద్యుత్, ప్రజాపనుల శాఖతో శాఖ 13 మంత్రిత్వ శాఖలను అతిషి నిర్వహించారు. ప్రస్తుతం కూడా ఆమె తన వద్దే ఆ శాఖలు ఉంచుకున్నారు. మరో మంత్రి సౌరభ్ భరద్వాజ్ చేతిలో ఏడు శాఖలు ఉన్నాయి. వీటిలో ఆరోగ్యం, పర్యాటకం, ఆర్ట్ అండ్ కల్చర్ శాఖలు కూడా ఉన్నాయి. గత మంగళవారం కేజ్రీవాల్ రాజీనామా చేయడంతో శనివారంనాడు ఢిల్లీ కొత్త సీఎంగా అతిషి ప్రమాణస్వీకారం చేశారు.

## పిడుగుపాటుకు చిన్నారులు సహా ఎనిమిది మంది మృతి..!



ఛత్తీస్‌గఢ్‌లో విషాదం చోటు చేసుకుంది. పిడుగుపాటుకు ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో నలుగురు చిన్నారులు కూడా ఉండటం కలచివేస్తోంది. రాజ్‌నంద్‌గావ్ జిల్లాలోని జోరటరాయ్ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు ఎస్పీ మోహిత్ గార్గ్ తెలిపారు. పిడుగుపాటుకు నలుగురు పాఠశాల విద్యార్థులు సహా ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. ఒకరికి గాయాలైనట్లు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించామన్నారు. ఈ ఘటనతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ స్పందించారు. తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాజ్‌నంద్‌గావ్‌లోని జోరటరాయ్ గ్రామంలో పిడుగుపాటుకు నలుగురు పాఠశాల విద్యార్థులు సహా ఎనిమిది మంది మరణించడం చాలా బాధాకరం అని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ఈ మేరకు సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని.. సరైన నష్టపరిహారం అందించాలని కోరారు.

# శాంతిభద్రతల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటి మీద దాడి కావచ్చు, నిన్న సునీత లక్ష్మారెడ్డి ఇంటి మీద దాడి కావచ్చు, రాష్ట్రంలో గూండాయిజం రాజ్యాన్ని తలపించే విధంగా పరిపాలన సాగుతుంది అని హరీశ్‌రావు తెలిపారు.

**కాంగ్రెస్ నాయకత్వం ప్రోత్సాహంతో జరిగిన దాడి**

తెలంగాణకున్న మంచి పేరును మంటగలిపి.. ఈరోజు బీహార్‌లాగా తెలంగాణను మారుస్తున్నారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. నిన్న సునీతా లక్ష్మారెడ్డి మీద జరిగిన దాడి కాంగ్రెస్ నాయకత్వం ప్రోత్సాహంతో జరిగిన దాడి అని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి రెచ్చగొట్టే మాటలు రాష్ట్రంలోని కాంగ్రెస్ కార్యకర్తలను ప్రతిపక్షాల మీద దాడి చేసే విధంగా ప్రోత్సహించినట్లు ఉన్నాయి. ఎమ్మెల్యే నివాసంలో లేనప్పుడు ఉద్దేశపూర్వకంగా దాడి చేయాలని, ఎమ్మెల్యే ఇంటి ముందు పటాకులు కాల్చడం, ఇంట్లోకి పటాకులు విసరడము ఇంట్లో ఉన్న వారిపై దాడి చేయడం హేయమైన చర్య అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

**పోలీసులపై దాడి జరిగినా కేసు నమోదు చేయడం లేదు..**

ఇప్పుడే ఎస్పీ, ఐజీతో మాట్లాడాను.. వెంటనే కాంగ్రెస్ గూండాలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేయడం జరిగిందని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు దాడి చేశారన్న విషయం వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నది. అంతే కాకుండా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్‌పై కూడా దాడి చేసే ప్రయత్నం చేశారు. హెడ్ కానిస్టేబుల్ చేతిలోని ఫోన్ లాక్కొని నెట్టేస్తే, ఆయన కింద పడిపోయాడు. పోలీసులపై దాడి జరిగినా కేసు నమోదు చేయడం లేదు. కాంగ్రెస్ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. దేశంలో తెలంగాణ పోలీసులు అంటే మంచి పేరు ఉండేది కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి పోలీసులను చెడగొడుతున్నారని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి శాశ్వతం కాదు..**



పోలీసు అధికారులు ఒక విషయం గుర్తుపెట్టుకోండి ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి శాశ్వతం కాదు. 10 సంవత్సరాలు బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉంది.. ఏనాడైనా ఎమ్మెల్యేల ఇంటిపైన దాడి జరిగిందా? ఫిర్యాదు ఇచ్చిన 24 గంటల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సందర్భాలు ఉన్నాయి. కాంగ్రెస్ గూండాల రాజ్యంలో ఎఫ్ఐఆర్ ఫైల్ చేయరు.. దాడి చేసిన వారిని అరెస్ట్ చేయరు. వెంటనే గోమారంలో దాడి చేసిన కాంగ్రెస్ గుండాలను అరెస్ట్ చేయాలి. దాడిని ప్రోత్సహించిన వారిపై కూడా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు.

**రాయలసీమ లాంటి ఫ్యాక్షన్ పరిస్థితులు తెలంగాణలో..**

నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్, స్టేట్ హ్యూమన్ రైట్స్ కమిషన్‌కి కూడా వెళ్తాం. దాడి చేసిన వారికి శిక్ష పడేదాకా వదిలిపెట్టం. ఇది ప్రజా పాలన కాదు గూండాల పాలన. మా ఓపికకు కూడా ఒక హద్దు ఉంటది. పోలీసులు ఇలాంటి దాడులను కట్టడి చేయడంలో విఫలమైతే రాయలసీమ లాంటి ఫ్యాక్షన్ పరిస్థితులు తెలంగాణలో కూడా వచ్చే అవకాశం ఉంది. తెలంగాణ ప్రాంతంతో, తెలంగాణ ప్రజలతో మాది పేగు బంధం. ఎక్కడ ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగకుండా మేము చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాం. అదేవిధంగా ప్రభుత్వం పోలీసులు కూడా వ్యవహరిస్తే మంచిది. ఇంట్లో చొరబడి దాడి చేసిన వారిని అరెస్టు చేసి రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సక్రమంగా ఉందని నిరూపించుకోవాలి. డిజిపి పదవికి గౌరవం తెచ్చే విధంగా చట్టానికి వ్యతిరేకంగా ఎవరు వెళ్లిన వారిని ఉపేక్షించవద్దు అని సూచిస్తున్నాను. ఈ ఘటనపై డీజీపీ వెంటనే స్పందించి దాడి చేసిన వారిని అరెస్ట్ చేయవలసిందిగా డిమాండ్ చేస్తున్నాను. ఒకవేళ అరెస్టు చేయనట్టయితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు.

# దుర్గం చెరువు వాసులకు గుడ్ న్యూస్

-మొదటిపేజీ తరువాయి


తీసుకోవాలని, అక్టోబర్ 4న లేక్ ప్రొటెక్షన్ కమిటీ ముందు దుర్గం చెరువు నిర్వాసితులు హాజరవుతారని, వారి అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని అక్టోబర్ 4 నుంచి ఆరు వారాలలోపు ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేయాలని లేక్ ప్రొటెక్షన్ కమిటీకి హైకోర్టు ఆదేశించింది.

విచారణ సందర్భంగా... బాధితుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. వారంలోపు చెరువుల పరిరక్షణ కమిటీ ముందు హాజరై అభ్యంతరాలను చెప్పాలని బాధితులకు కూడా సూచించింది. ఆరు వారాల్లోగా ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ధారించాలని హైకోర్టు ఆదేశించింది.

ఈ క్రమంలో, ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ధారించే వరకు ఎలాంటి కూల్చివేతలు చేపట్టబోమని జీహెచ్ఎంసీ తెలిపింది. రికార్డుల ప్రకారం దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో 65 ఎకరాలు మాత్రమే ఉందని, అధికారులు మాత్రం 160 ఎకరాలు అంటున్నారని, ఇది సరైనది కాదని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు.

కాగా జెట్ స్పీడ్‌లో హైడ్రా బుల్డోజర్లు దూసుకెళ్తున్నాయి. జూన్ 26 నుంచి కూల్చివేతలు మొదలు పెట్టింది. ఇప్పటి వరకు 30 ప్రాంతాల్లో 300 ఆక్రమణలను కూల్చి వేసింది. ఆక్రమణలకు గురైన 120 ఎకరాలను ప్రభుత్వానికి అప్పగించింది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్లను కబ్జా చేస్తూ బహుళ





అంతస్తుల నిర్మాణాలపై ఫిర్యాదులు రావడంతో చెరువును హైడ్రా కమిషనర్ రంగనాధ్ పరిశీలిస్తున్నారు. వెంటనే రంగంలోకి దిగి హైడ్రా సిబ్బంది కూల్చివేస్తున్నారు. హై రీచ్ జా క్రషర్స్‌తో పాటు జేసీబీలతో, బుల్డోజర్లతో కూల్చి వేతలు చేపట్టారు. జీహెచ్ఎంసీతో పాటు ఓఆర్ఆర్ లోపల ఉన్న 27 మున్సిపాలిటీలు, 33 గ్రామాల్లో హైడ్రా దూకుడు పెంచింది. కాగా హైడ్రా రికార్డు క్రియేట్ సృష్టించింది. అమీన్ పూర్‌లో హైడ్రా బిగ్ ఆపరేషన్ చేపట్టింది. 17 గంటలపాటు నాన్ స్టాప్‌గా ఇళ్లులు, భవనాలు, అపార్టుమెట్లు కూల్చివేసింది. అలాగే ఓ హాస్పిటల్, రెండు అపార్ట్ మెంట్లు కూల్చివేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. పటేల్ గుడాలో 16 విల్లాలు కూల్చివేసింది. సోమవారం తెల్లవారుజాము ఒంటిగంట వరకు కూల్చివేతలు కొనసాగాయి. హైడ్రా ఏర్పాటు తర్వాత తొలిసారిగా డే అండ్ నైట్ కూల్చివేతలు జరిగాయి. అక్రమ నిర్మాణాలకు అనుకొని ఉన్న పక్క ఇళ్లకు డ్యామేజ్ కాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. హైడ్రా 17 గంటలపాటు హైరిస్క్ ఆపరేషన్ కొనసాగించి రికార్డు క్రియేట్ చేసింది.

కాగా గణేశ్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో రెండు వారాలపాటు కూల్చివేతలకు తాత్కాలిక విరామం ప్రకటించిన హైడ్రా.. తిరిగి తన పనిని మొదలుపెట్టింది. చెరువులు, ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ నిర్మాణాలపై మరోసారి కొరడా ఝుళిపించింది. ఏకకాలంలో కూకట్‌పల్లిలో, అమీన్‌పూర్ మునిసిపాలిటీలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడలో ప్రభుత్వ భూముల్లోని నిర్మాణాలను నేలమట్టం చేసింది. కూకట్‌పల్లి శాంతినగర్‌లోని నల్లచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో, కిష్టారెడ్డిపేటలోని ఎకరంపైగా, పటేల్‌గూడలోని మూడు ఎకరాలకుపైగా విస్తీర్ణంలోని నిర్మాణాలను కూల్చివేసింది. రెవెన్యూ, నీటి పారుదల, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి హైడ్రా బృందం కూల్చివేతలు చేపట్టింది. మూడు ప్రాంతాల్లోని 8 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆక్రమణలు, భవనాలు తొలగించినట్టు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. అయితే తమ సామాన్లను కూడా తీసుకునే సమయం ఇవ్వకుండా నిర్మాణాలు నేలమట్టం చేశారని బాధితులు లబోదిబోమన్నారు. అప్పులు చేసి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే తాము హైడ్రా చర్యతో రూ.లక్షల్లో నష్టపోయి రోడ్డున పడ్డాయని ఆవేదన చెందారు.

# హైడ్రా దూకుడు!

-మొదటిపేజీ తరువాయి

ఎలాంటి అధికారాలు లేనప్పటికీ హైడ్రా ఓ స్థాయిలో దూసుకుపోయింది. తాజాగా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హైడ్రాకు మరింత బలాన్ని చేకూర్చింది. నిన్నటి కేబినెట్‌లో హైడ్రాకు అడిషనల్ పవర్స్ ఇస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దాంతో ఇప్పటికే ఎక్కడా తగ్గకుండా దూసుకెళ్తున్న హైడ్రా.. కేబినెట్ నిర్ణయంతో తన దూకుడును మరింత పెంచనుంది. ఇప్పుడు దానికి విస్తృత అధికారాలతో పాటు చట్టబద్ధతను కూడా ఇచ్చారు. చెరువులతోపాటు గ్రేటర్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను తొలగించే వరకూ హైడ్రాకు విశేష అధికారాలు అలానే ఉంటాయని కేబినెట్ స్పష్టం చేసింది. అయితే.. కేబినెట్‌లో మరో నిర్ణయం తీసుకున్నారు. హైడ్రా పరిధిని ఔటర్ రింగ్ రోడ్డు లోపల 27 అర్బన్, లోకల్ బాడీలకు విస్తరించింది. 51 గ్రామపంచాయతీలను కూడా కోర్ అర్బన్‌లో విలీనం చేస్తూ నిర్ణయం తీసకున్నారు. అలాగే.. ఇప్పటివరకు కేవలం ఒక్క కమిషనర్ రంగనాథ్ మాత్రమే అన్నీతానై ఇదంతా నడిపించారు. కానీ.. తాజాగా ప్రభుత్వం అదనంగా సిబ్బందిని కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి హైడ్రా ఆపరేషన్స్ కోసం 150 మంది అధికారులతోపాటు 964 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందిని కేటాయించారు.ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. హైడ్రా ఏర్పాటు నుంచి రేవంత్ రెడ్డి సర్కార్ పలు విమర్శలు, పలు ప్రశంసలు ఎదుర్కొంటోంది. హైడ్రా ఆపరేషన్స్ బాగుందని చాలా వరకు వినిపిస్తుండగా.. మరికొంత మంది నుంచి మాత్రం పేదల కడుపు కొట్టడానికే హైడ్రా తెచ్చారనే విమర్శలు వచ్చాయి. అయితే.. చాలా జిల్లాల నుంచి కూడా హైడ్రాను తమ జిల్లాల్లోనూ ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపించింది. అటు పొరుగు రాష్ట్రమైన ఏపీ నేతల నుంచి కూడా హైడ్రా పై ప్రశంసలు వచ్చాయి. అందులోభాగంగానే తాజాగా.. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు విశేషాధికారాలు కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే.. ఈ నిర్ణయంతో రేవంత్ రెడ్డి సర్కారుకు ప్లస్ కానుందా..? మైనస్ కానుందా..? అనే చర్చ సైతం జోరుగా నడుస్తోంది. పొలిటికల్ లీడర్లు హైడ్రాను ముందు నుంచీ వ్యతిరేకిస్తూ వస్తున్నారు. అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీ సైతం హైడ్రాపై అసంతృప్తితోనే ఉన్నాయి.



పర్మిషన్లు తీసుకున్న వారి ఇళ్లను ఎలా కూల్చివేస్తారంటే నిలదీస్తున్నారు. వీటన్నింటి నేపథ్యంలో ముందు ముందు హైడ్రా పనితీరు ఇంకా ఎలా ఉండబోతోంది..? వచ్చిన అధికారాలను ఎలా వినియోగించుకోబోతోందో అని ఆసక్తి నెలకొంది.

**ఎవరేమనుకున్నా...**

హైదరాబాద్ డిజాస్టర్ అండ్ రెస్పాన్స్ అస్సెట్స్ ఏర్పాటుతో చెరువులు, నాలాలు, కుంటలు ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను ఇప్పటికే అనేకమైన వాటిని కూల్చివేసింది. అయితే ఇంకా వందకు పైగా ఫిర్యాదులు హైడ్రా వద్ద ఉన్నాయి. ముఖ్యమైన భవనాలను నిర్మించి అక్కడ వ్యాపారాలు, విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల ఆసుపత్రులు కూడా నిర్వహిస్తుండటంతో వాటిని కూడా కూల్చాలని రేవంత్ రెడ్డి హైడ్రా అధికారులను ఆదేశించారు. 169 మంది అదనపు సిబ్బందిని హైడ్రాకు కేటాయించడం వెనక కూడా రానున్న కాలంలో హైదరాబాద్ నగరంలో కూల్చివేతలు మరింతగా ఉంటాయాన్న సంకేతాలు పంపినట్లయింది. అసెంబ్లీ సమావేశాల్లో కూడా హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ ఆర్డినెన్స్ ను తెచ్చే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇప్పటికే అనేక కూల్చివేతలను చేపట్టి యాభై ఎకరాల ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్న హైడ్రా రానున్న కాలంలో మరింత స్పీడ్ పెంచే విధంగా అడుగులు వేయనున్నట్లు అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. రాజకీయ నేతల ఆక్రమణలను కూల్చివేతలను త్వరలో ప్రారంభిస్తారని తెలిసింది. విద్యాసంస్థలను మాత్రం ఏ ఏడాది వేసవి సెలవుల్లో కూల్చివేతలను చేపట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. మధ్యలో అయితే విద్యార్థుల చదువుకు ఆటంకం ఏర్పడి విద్యాసంవత్సరం నష్టపోయే అవకాశముందని, తల్లిదండ్రుల నుంచి వ్యతిరేక వస్తుందని భావించి కొంత వెనకడుగు వేసింది. ఈ లోపు న్యాయస్థానంలో వేసిన కేసుల విషయంలోనూ హైడ్రా కొంత సమాచారం ఇచ్చి క్లియర్ చేసుకోవాలని భావిస్తుంది. సుప్రీంకోర్టు ఆదేశాలు కూడా ఉండటంతో కొంత విరామమిచ్చిన హైడ్రా చట్టపరంగా అన్ని క్లియర్ చేసుకున్న తర్వాతనే ముందుకు వెళ్లాలని రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు తెలిసింది. ఇప్పటికే న్యాయపరమైన చిక్కులు తొలగించేందుకు న్యాయనిపుణులతో హైడ్రా అధికారులు చర్చిస్తున్నారు

## కేడర్‌ను సిద్ధం చేస్తున్న రేవంత్

-మొదటిపేజీ తరువాయి

పీసీసీ అధ్యక్షుడు కూడా రావడంతో అన్ని రకాలుగా ముందుకు వెళ్లి పార్టీని బలోపేతం చేయాల్సిన అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. అందుకోసమే ప్రత్యేకంగా సీఎల్పీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నేతలకు నియోజకవర్గాలుగా బాధ్యతలను అప్పగించి అక్కడి ప్రధాన సమస్యలపై రానున్న కాలంలో దృష్టి పెట్టి నోటిఫికేషన్ కు ముందే ప్రజల మనసులను గెలిచే ప్రయత్నంలో రేవంత్ రెడ్డి ఉన్నారు. హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ తో స్థానిక సంస్థల్లో విజయం సాధించాలన్న లక్ష్యాన్ని నేతల ముందు రేవంత్ రెడ్డి ఉంచనున్నట్లు తెలిసింది. దీంతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ను మరింత నిర్వీర్యం చేసేందుకు అవసరమైన ప్రణాళికలను కూడా సిద్ధం చేసుకున్నారు. ఒకవైపు ప్రతిపక్షాలను బలహీనపరుస్తూనే మరొక వైపు మరిన్ని పథకాలను వీలయినంత త్వరగా అమలు చేయాలన్న నిర్ణయానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చినట్లు తెలిసింది. ఇందుకోసం రోడ్డు మ్యాప్ ను నేడు సిద్ధం చేయనున్నారని తెలిసింది. ఇప్పటికే అమలు చేసిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు మరిన్ని వాగ్దానాలు చేయడమే కాకుండా మిగిలిపోయిన రైతు భరోసా, మహాలక్ష్మి పథకంలో కొన్నింటిని అమలు చేయడంపై నేటి సమావేశంలో చర్చించనున్నారని తెలిసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా రైతు రుణమాఫీ చేశామని, అయితే ఇది రైతుల్లోకి బలంగా వెళ్లలేకపోయిందన్న భావనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం లేకుండా ప్రకటనలు చేయడం ప్రత్యర్థి పార్టీలు విమర్శలు చేయడానికి ఊతమిచ్చినట్లయిందని ఆయన అభిప్రాయపడుతున్నారు. అందుకోసమే అందరూ సమన్వయంతో ఒకే మాట మీద ఉండాలని, రైతు రుణమాఫీ అంశంపై కొందరు తప్ప అందరూ మాట్లాడకపోవడమే మంచిదన్న అభిప్రాయంలో రేవంత్ రెడ్డి ఉన్నారు. మొత్తం మీద నేడు జరుగుతున్న సమావేశంలో నేతలకు రేవంత్ రెడ్డి అన్ని విషయాలపై కూలంకషంగా దిశానిర్దేశం చేయనున్నారని సమాచారం.

## వరద బాధితులకు సూపర్ స్టార్ మహేశ్ విరాళం

-మొదటిపేజీ తరువాయి

రూ.50లక్షల చొప్పున ప్రకటించారు. ఈ మేరకు ఇవాళ(సోమవారం) తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కలిసి దానికి సంబంధించిన రూ.50లక్షల చెక్కును అందజేశారు. అలాగే ఏఎంబీ మాల్ తరపున మరో రూ.10లక్షలు అందజేశారు. దీంతో ఆయన తెలంగాణకు మొత్తంగా రూ.60లక్షలు ఇచ్చినట్లు అయ్యింది. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి మహేశ్ చెక్కు అందజేశారు. మహేశ్ బాబుతోపాటు ఆయన సతీమణి నమ్రత శిరోద్కర్ కూడా ఉన్నారు. వారిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించిన సీఎం ఇద్దరినీ శాలువాతో సన్మానించారు.

**మహేశ్ లుక్ వైరల్..**

అయితే చెప్పిన దాని కన్నా అదనంగా మరో రూ.10లక్షలు ఇవ్వడంపై ఆయన ఫ్యాన్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహేశ్ బాబు తన మంచి మనస్సును మరోసారి చాటుకున్నారని సోషల్ మీడియా వేదికగా కామెంట్లు పెడుతున్నారు. ఇప్పటికే ఆయన చాలా మంది పిల్లలకు గుండె ఆపరేషన్లు సహా పలువురిని ఆదుకున్నారని గుర్తు చేసుకుంటున్నారు. తమ అభిమాన నటుడికి మంచి మనసు ఉందంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మహేశ్ బాబు కొత్త లుక్ వైరల్ అవుతోంది. డైరెక్టర్ రాజమౌళితో మహేశ్ చేస్తున్న '%యావీదీ% 29' సినిమా కోసం సూపర్ స్టార్ నయా లుక్‌లో కనిపించారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో ఈసారి భారీ విజయం ఖాయమంటూ ఫ్యాన్ సంబరపడిపోతున్నారు.

## పువ్వులనే దైవాలుగా పూజించే పండుగ..

దేవుళ్లను పువ్వులతో పూజించడం సహజం. కానీ పువ్వులనే దేవుళ్లుగా కొలిచే పండుగ ఒకటి ఉంది. అదే మన తెలంగాణ బతుకమ్మ పండుగ. ఇలా పువ్వులను పూజించే సంస్కృతి బహుషా ప్రపంచంలో ఎక్కడా ఉండకపోవచ్చు. మరికొద్ది రోజుల్లో తెలంగాణలో బతుకమ్మ సంబరాలు ప్రారంభం కానున్నాయి. తెలంగాణ ఉద్యమ కాలంలో పాటకు ఎంత ప్రాధాన్యం ఉండేదో.. బతుకమ్మకు కూడా అంతే ప్రాధాన్యం ఉండేది. తెలంగాణ అస్తిత్వ పోరాట చిహ్నంగా 'బతుకమ్మ' మారిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అంతటి ప్రాధాన్యం కలిగిన బతుకమ్మ గురించి మరిన్ని విశేషాలు తెలుసుకుందాం..

ప్రతి ఏటా ఈ బతుకమ్మ పండుగ సమీపించే సమయానికి ప్రకృతి అంతా పూలవనంగా మారుతుంది. ప్రకృతిలో సేకరించిన పూలను ప్రకృతికే సమర్పించుకోవాలనే ఉద్దేశంతో బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేస్తారు. నిత్యనూతనమై తెలంగాణ వాకిట్లో సిరులొలికించే ప్రకృతి పండుగ బతుకమ్మను మహిళలు భక్తి పారవశ్యంతో జరుపుకోవడం ఆనవాయితీ. శీతాకాలపు తొలిరోజుల్లో వచ్చే ఈ పండుగ వేళ వర్షాలతో జలాశయాలు కళకళలాడుతుంటాయి. రకరకాల, రంగురంగుల పువ్వులు వికసించి కనువిందు చేస్తుంటాయి. గునుగుపూలు, తంగేడు పూలు ఎక్కడ చూసినా విరబూసి ఉంటాయి. బంతి, చేమంతి, నందివర్ధనం లాంటి పూలకు కూడా ఇదే సీజన్. సోంపు పూలు, టేకు పూలు కూడా ఇదే సీజన్‌లో లభిస్తాయి. గుమ్మడి, కట్లాయి, అల్లీపూలు ఇదే సమయంలో విరబూస్తాయి. అశ్వయుజ మాసం పెత్రమాస (మహాలయ అమావాస్య, పితృ అమావాస్య) తో బతుకమ్మ వేడుకలు ఆరంభమవుతాయి. అష్టమి వరకు కొనసాగే ఈ పండుగలో కేవలం ఆచారమే కాదు.. శాస్త్రీయత కూడా దాగి ఉంది. కొత్త బట్టలు ధరించి, ఇత్తడి తాంబూలంలో గుమ్మడి ఆకులు పరిచి, వాటిమీద తంగేడు పూలు పేరుస్తారు. తర్వాత గునుగు, బంతి, చామంతి, అడవి చామంతి, ముత్యాల పువ్వు, రుద్రాక్ష, నీల గోరింట, పట్టుకుచ్చులు, కట్ల, బీర పువ్వులను బతుకమ్మలను పేర్చడంలో వినియోగిస్తారు. బతుకమ్మకు వాడే పువ్వులన్నీ ఔషధ గుణాలు కలిగి ఉంటాయి. తంగేడు పూలు గొంతు, మూత్ర సంబంధిత సమస్యలకు ఔషధంగా పనిచేస్తాయి. గునుగు పువ్వు యాంటీ డయేరియా, యాంటీ డయాబెటిక్ లక్షణాలు కలిగి ఉంటుంది. బంతి పువ్వు క్రిమిసంహారిణి, దోమలను నివారించే శక్తికలిగి ఉంటుంది. చామంతిని కాలిన గాయాలకు, దెబ్బలకు, కంటి సంబంధిత రోగాలకు, జీర్ణానికి ఔషధంగా వాడతారు. ఇది యాంటీ బ్యాక్టీరియా లక్షణాలు కలిగి కాలుష్య కారకాలైన బెంజిన్, అమ్మోనియా వాయువులను పీల్చుకుని గాలిని శుద్ధి చేస్తుంది. ఇలా బతుకమ్మ పేరిట వాడే ప్రతీ పువ్వుకు అనేక ఔషధ గుణాలున్నాయి. ఈ పువ్వులన్నింటినీ గోపురంలా పేర్చాక పైన గుమ్మడి పువ్వు గొడుగు పెడతారు. తమల పాకులో పసుపుతో చేసిన గౌరమ్మను ఉంచి పక్కనే దీపం వెలిగిస్తారు. పసుపు శుభసూచకం. అంతేకాదు క్రిమి సంహారిణి కూడా. ఇక దీపం జ్ఞానానికి సంకేతం. అది గాలిని శుద్ధి చేస్తుంది. క్రిములను హరిస్తుంది. బతుకమ్మల్లోని పూలకున్న ఔషధగుణాలు నిమజ్జనం సందర్భంగా నీటిని శుద్ధి చేసి, నీటి ద్వారా వచ్చే రోగాలను హరిస్తాయి. తొమ్మిది రోజులు జరుపుకునే బతుకమ్మ పండుగలో ఎన్నో విశిష్టతలు దాగి ఉన్నాయి. ఆడపడుచులు తమ మనోభావాలను పాటల ద్వారా వెల్లడిస్తారు. సంతోషాన్ని అడుగులు, చప్పట్ల ద్వారా ప్రదర్శిస్తారు. స్త్రీల సౌందర్య ఆరాధనం, అలంకార నైపుణ్యం, కళాత్మక దృష్టి, బతుకమ్మను పేర్చడంలో ఉట్టిపడుతుంది. పండుగలో తల్లి బతుకమ్మ, పిల్ల బతుకమ్మలు పేర్చడం ద్వారా తల్లి పక్కనే పిల్ల ఉండాలనే స్త్రీమాతృ హృదయం ఎలాంటిదో అవగతమవుతుంది. త్రికోణం స్త్రీకి సంకేతం. త్రికోణం (పిరమిడ్ ఆకారం) లోని పసుపు ముద్ద సంతాన, సౌభాగ్య ప్రదాయిని అయిన గౌరీదేవికి చిహ్నమని పూర్వీకులు ఆడపడుచులకు అర్థమయ్యే రీతిలో చెబుతుంటారు. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో' అంటూ సాయంత్రం ఇంటి ముందు కానీ, వీధిలో కానీ, దేవాలయంలో కానీ, చెరువు దగ్గర కానీ, వాగు దగ్గర కానీ ఆడపడుచులంతా చేరి బతుకమ్మలను మధ్యలో పెట్టుకుని పాటలు పాడతారు. ఒకరు పాట చెబుతుంటే మిగతా మహిళలు వంతపాడుతారు.

**ఏ రోజు ఏ బతుకమ్మ..!**

ఏకంగా తొమ్మిది రోజులపాటు ఈ బతుకమ్మ ఉత్సవాలు జరుగుతాయి. తొమ్మిది రోజులు జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలను 9 వేర్వేరు పేర్లతో పిలుస్తారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ, రెండోరోజు అటుకుల బతుకమ్మ, మూడోరోజు ముద్దపప్పు బతుకమ్మ, నాలుగో రోజు నాన బియ్యం బతుకమ్మ, ఐదోరోజు అట్ల బతుకమ్మ, ఆరోరోజు అలిగిన బతుకమ్మ, ఏడోరోజు వేప కాయల బతుకమ్మ, ఎనిమిదో రోజు వెన్న ముద్ద బతుకమ్మ, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ. ఇలా రోజుకో పేరుతో అమ్మవారిని కొలుస్తారు. ఆరో రోజున అలిగిన బతుకమ్మకు నైవేద్యం ఉండదు. కానీ మిగిలిన అన్ని రోజుల్లో రోజుకో రకం పదార్థాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.

మంగళవారం 24 సెప్టెంబర్ 2024

అగ్నిధార
http://www.agnidharanews.com

## సంపాదకీయం

# ఎమర్జెన్సీ సినిమాపై రాద్ధాంతం ఎందుకు?

1975 ఎమర్జెన్సీ భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఒక చీకటి అధ్యాయం. ప్రధాని ఇందిరాగాంధీ 1975లో ఎమర్జెన్సీని ఎందుకు విధించినట్లు? ఎమర్జెన్సీ కాలంలో పత్రికలు, ప్రతిపక్ష నాయకులు, ప్రజాస్వామ్యవాదులు ఎలాంటి ఇబ్బందులను, అణచివేతలను ఎదుర్కొన్నారు అనే విషయం నేటి యువతకు తెలియదు. ఎమర్జెన్సీ పరిస్థితులను కథా వస్తువుగా సినీనటి, లోక్‌సభ సభ్యురాలు కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో, తానే ప్రధాన పాత్రగా (ఇందిరాగాంధీ) ఎమర్జెన్సీ సినిమాను తీస్తున్నారు. ఈ సినిమా విషయంలో కంగనా రనౌత్ పెద్ద సాహసమే చేశారని చెప్పాలి. చారిత్రిక సత్యాలను సినిమాల ద్వారా చూపిస్తే ఈ దేశంలో చాలామందికి నచ్చదు. మరీ కుల పిచ్చితో, మత పిచ్చితో కునారిల్లే వర్గాలకు ఎమర్జెన్సీ సినిమా కథా వస్తువు ఇబ్బందిని కలిగిస్తుంది. ఎమర్జెన్సీ అకృత్యాల గరించి మాట్లాడితే కాంగ్రెస్ నాయ కులు అగ్గి మీద గుగ్గిలమవుతారు. పంజాబ్ రాష్ట్రంలో ప్రజాదరణ కలిగిన అకాలీ దళ్ పార్టీని బలహీనపరచడానికి మతోన్మాద భావజాలం ఉన్న బింద్రెన్ వాలేను, అతని అనుచరులను స్వయానా ఇందిరాగాంధీ పెంచి పోషించారు. 'పాముకు పాలు పోస్తే కాటేసిన చందంగా' ఆమె పెంచి పోషించిన ఖలిస్తాన్ ఉగ్రవాదమే ఆమెను కాటేసింది. సిక్కు తీవ్రవాదం బలపడి, భారతదేశ సమగ్రతకు ఒక సవాలుగా మారింది. బింద్రెన్ వాలా అమృత్ సర్ స్వర్ణ దేవాలయాన్ని తీవ్రవాదులకు కేంద్రంగా మార్చడంతో.. భారత సైన్యం 'ఆపరేషన్ బ్లూ స్టార్' పేరుతో స్వర్ణ దేవాలయంలో దాక్కున్న సిక్కు తీవ్రవాదులను మట్టుపెట్టడం జరిగింది. ఈ ఆపరేషన్‌కు అనుమతించిన ఇందిరా గాంధీని సిక్కు బాడీగార్డులు సత్వంత్ సింగ్, బియాంత్ సింగ్‌లు అతి కిరాతకంగా కాల్చి చంపారు. ఇందిరా గాంధీ హత్యానంతరం దేశంలో అనేక ప్రాంతాల్లో అమాయకపు సిక్కులు నరమేధానికి గురయ్యారు. ఈ విషయాలను ఎమర్జెన్సీ సినిమాలో కొంతమేరకు చూపించినా, చూపించకపోయినా సత్యం దాగదు! అయితే ఇప్పుడు ఈ సినిమాకు సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇవ్వరాదు అంటూ శిరోమణి గురుద్వారా ప్రబంధ కమిటీ లేఖ రాయడం లోతుగా ఆలోచించాల్సిన విషయమే! ఈ సినిమా విషయంలో సిక్కులు ఎందుకు ఆందోళన చెందుతున్నారు? ఖలిస్తాన్ ఉద్యమం పంజాబ్ రాష్ట్రంలో సృష్టించిన అరాచక పరిస్థితులను ప్రజలు తెలుసుకుంటారని సిక్కు నాయకులు భయపడుతున్నారా? అధికార దాహంతో తీవ్రవాద కార్యకలాపాలతో సంబంధం ఉన్న సంస్థలను సమర్థించడం, అక్కున చేర్చుకోవడం కాంగ్రెస్ పార్టీకి అలవాటైన విషయమే! దేశంలో ముస్లింల ఓటు బ్యాంకు కోసం ఇస్లామిక్ తీవ్రవాదులను కాంగ్రెస్ పార్టీ పెంచి పోషించింది. బర్మా, బంగ్లాదేశ్‌ల నుంచి వచ్చిన అక్రమ చొరబాటుదారులకు ఆశ్రయమిచ్చి, భారతీయ పౌరులుగా మార్చింది. ఈ కారణంగానే ఎన్ఆర్సీ, సీఏఏలను వ్యతిరేకిస్తోంది. ఇలాంటి దేశద్రోహపు పనిని ప్రపంచంలోని ఏ రాజకీయ పార్టీ చేయదు. ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తూ, నటిస్తున్నందుకు కంగనా రనౌత్ తలతీస్తామని, ఇందిరాగాంధీకి పట్టిన గతి ఏమిటో తెలుసుకోవాలని ఆమెకు వీడియోలు పంపడం, సిక్కు నాయకుల చేత హెచ్చరికలు జారీ చేయించడం వెనుక కాంగ్రెస్ పార్టీ హస్తం లేదని చెప్పడం అసాధ్యం. వాస్తవ విషయం అర్థం చేసుకున్న కంగనా రనౌత్ ఈ సినిమా రిలీజ్ విషయంలో సహకరించాలని ప్రతిపక్ష నాయ కుడు రాహుల్ గాంధీని కోరడం కొసమెరుపు. ఈ సినిమా చూస్తే ఎమర్జెన్సీ పరిస్థితులు, ఎమర్జెన్సీ ఆకృత్యాలు దేశ ప్రజలకు తెలిసి, కాంగ్రెస్ పార్టీని ప్రజలు అసహ్యించుకుంటారేమో అనే భయం కాంగ్రెస్ నాయకులకు ఏర్పడినట్లు ఉంది. అందుకే శిరోమణి గురుద్వారా ప్రబంధ కమిటీని రెచ్చగొట్టింది. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నడిపే రైతు ఉద్యమం వెనుక ఈ కమిటీ అనుయాయులు చాలామంది ఉన్నారనే విషయం అర్థమైతే కాంగ్రెస్ పార్టీకి సిక్కు నాయకులు ఉన్న సంబంధం ఏమిటో స్పష్టం అవుతుంది. కంగనా రనౌత్‌కు వ్యతిరేకంగా జారీ అయిన హెచ్చరికల విషయంలో నెటిజెన్లు ఆమెకు మద్దతుగా నిలిచారు. మానవహక్కుల సంఘా ల వాళు ,, ప్రజాస్వామ్యవాదులమని బోర్డులు తగిలించుకున్న వారు మాత్రం ఈ విషయంపై నోరు మెదపకపోవడం ఆశ్చర్యం కలిగించదు. కానీ బాలీవుడ్ సినీరంగం ఆమెకు బాసటగా నిలవకపోవడం సినిమా వాళ్ల మానసిక దౌర్భాగ్యాన్ని తెలియజేస్తుంది. హిందూ సమాజంలోని అగ్రకులాల దౌర్జన్యాలను కథావస్తువుగా చూపించిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి సినిమాలు నిర్మించిన వాళ్లను మట్టుపెడతామని అగ్రకులాలకు చెందినవారు చెలరేగిపోయిన దాఖలాలు లేవు. మరి ఎమర్జెన్సీ సినిమా విషయంలో సిక్కు నాయకుల గాండ్రిం పులు ఎందుకు? అనవసరంగా ఒక లేడీ కానిస్టేబుల్ ఆమెపై చేయి చేసుకున్నప్పుడు సినీరంగం ఆమెకు సంఘీభావం తెలపలేదు. అందుకు కారణం ఆమె హిందుత్వవాది కావడమే! ఆమె అధికార పార్టీ ఎంపీ అయినప్పటికీ ఆమెకు ప్రభుత్వం నుంచి అండ లభించలేదు. ఆమె అంటే గిట్టని వాళ్లు ఎన్ని విమర్శలు చేసినా, రాజపుత్ర స్త్రీగా కంగనా రనౌత్ ఎమర్జెన్సీ సినిమా విడుదలను అడ్డుకోవాలని ప్రయత్నించే వారికి ధైర్యంగా 'ప్రతి సవాలు' విసరడం వీరోచిత చర్యగా భావించక తప్పదు.

# విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ



విద్యార్థుల ప్రప్రథమ కర్తవ్యం విద్యాభ్యాసం. కానీ భావి భారతాన్ని నిర్ణయించ వలసినది యువకులే. ప్రతి దేశ పురోభివృద్ధి లోనూ, ఉద్యమాల లోనూ విద్యార్థులు పాలు పంచు కుంటారు. ఒక్కొక్కసారి ఆవేశం ఎక్కువ కావచ్చు కానీ కల్లాకపటం ఎరగని నిర్మల, సున్నిత మనస్కులు విద్యార్థులు. వారు కూడా సంఘజీ వులే, సంఘంలో భాగస్వాములే, సంఘసేవ వారికీ సామాజిక బాధ్యతగా ఉంది. విద్యాభ్యా సానికి ఆటంకాలు లేకుండా సంఘసేవ చేసే అవకాశాలను ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. విద్యను ఆర్జించే వయసులోనే యువతీ యువకులలో సేవాభావం, దేశభక్తి, సామాజిక స్పృహ ను కలిగించేందుకు 'జాతీయ సేవా పథకం' (ఎన్ఎస్ ఎస్) ప్రారంభమైంది. నిరుపేదల కష్ట సుఖాలలో పాలు పంచుకుంటూ, సమాజ సేవ చేసే లక్ష్యంతో జాతిపిత మహాత్మా గాంధీ శత జయంతి సందర్భంగా 1969 సెప్టెంబర్ 24వ తేదీన ఈ పథకాన్ని దేశ వ్యాప్తంగా మొదలు పెట్టారు. అప్పటి "విశ్వ విద్యాలయాల నిధుల సంఘం" (యూజీసీ) చైర్మన్ రాధాకృష్ణన్ జాతీయ సేవా పథకాన్ని విద్యా సంస్థలలో ప్రారంభించాలని సూచించారు. 1959 జనవరిలో జరిగిన సీఏబీఈ పాలక మండలి ఆయన సూచనకు ఆమోదం తెలిపింది. 1952లో పంచవర్ష ప్రణాళికలో ప్రతిపాదించబడి, 4వ పంచవర్ష ప్రణాళికలో ప్లానింగ్ కమిషనర్ ద్వారా 5కోట్ల రూపాయలను ఎన్ఎస్ఎస్ పథకానికి కేటాయించారు. 1958లో అప్పటి ప్రధాన మంత్రి పండిట్ నెహ్రూ దేశంలోని ముఖ్య మంత్రులకు జాతీయ సేవా పథకాన్ని అమలు చేయాలంటూ లేఖలు రాశారు. ఈ పథకానికి తగిన వ్యూహ రచన చేయాలని కూడా ఆయన కేంద్ర విద్యాశాఖను ఆదేశించారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 37 విశ్వ విద్యాలయాలలో సుమారు 40,000 మంది వాలంటీర్లతో అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి వి.కె.ఆర్.రావు ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. 1999 నాటికి ఈ పథకంలో 13,52,000 మంది వాలంటీర్లు ఉన్నారు. 176 విశ్వ విద్యాలయాల పరిధిలో లక్షలాది మంది విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో సేవలందిస్తున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ ఎన్ఎస్ఎస్ యూనిట్లను కళాశాల స్థాయిలో ప్రారంభించారు. లక్షలాది మంది వాలంటీర్లు సమాజ సేవలో భాగస్వాములు అవుతున్నారు. ప్రతిఫలం ఆశించకుండా సేవా మార్గం పట్టేవారే ఎన్ఎస్ఎస్‌లో వలంటీర్లుగా చేరతారు. మొక్కల పెంపకం, పారిశుద్ధ్యం, రక్తదాన శిబిరాలు, అక్షరాస్యత వంటి కార్యక్రమాల్లో విద్యార్థినీ విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. సామాజిక కార్యక్రమాల అమలులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఒకనాడు దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఒకవైపు విద్యా వ్యాసంగాన్ని కొనసాగిస్తూనే, మరోవైపు సంఘసేవకు విద్యార్థులను సమాయాత్త పరచేదే జాతీయ సేవా పథకం. సామాజిక కార్యక్రమాలపై యువతకు తర్ఫీదునివ్వడమే గాక, వారి సేవలను వినియోగించు కోవడం ఎన్ఎస్ఎస్‌లో కనిపిస్తుంది. కళాశాల స్థాయిలో ఎన్ఎస్ఎస్ విభాగాలకు ప్రిన్సిపాల్ పర్యవేక్షకుడిగా, ఒక అధ్యాపకుడు ప్రోగ్రాం అధికారిగా వ్యవహరిస్తారు. సమాజ సేవ పట్ల ఆసక్తి చూపే విద్యార్థులను ఇందులో చేర్చుకుంటూ, ప్రతి వందమంది విద్యార్థులను ఒక యూనిట్‌గా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూంటారు. రెండు విద్యా సంవత్సరాలలో కనీసం 240 గంటలు సంఘసేవలో పాల్గొనేలా కృషి జరుగుతోంది. భావితరాలకు వారసులైన విద్యార్థులు జట్లుగా పనిచేస్తూ ఐక్యతా భావాన్ని పంచు కుంటారు. సమాజంలో విద్యార్థి తన స్థానాన్ని, గమ్యాన్ని నిర్ణయించు కొనేలా చేయడం ఇందులోని ప్రధాన అంశం. విద్యార్థులు చిత్తశుద్ధితో, క్రమశిక్షణతో సామాజిక సేవలో పాల్గొనేలా చేయడమే జాతీయ సేవా పథకం ప్రధాన ధ్యేయం. కళాశాల ప్రిన్సిపాల్ నిర్ణయించిన ప్రకారం సమీప ప్రదేశాల్లో ఆలయాలు, చారిత్రక కట్టడాల పునరుద్ధరణ, గ్రామీణ ప్రాంతాలలో అపరిశుభ్రతను తొలగించడం, మంచినీటి సౌకర్యాల మెరుగుదలకు శ్రమదానం, పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు ఎన్ఎస్ఎస్ శిబిరాలలో నిర్వహిస్తుంటారు. ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని అక్కడి వసతులను గ్రామస్తుల సహకారంతో మెరుగు పరచేందుకు విద్యార్థులు కృషి చేస్తారు. రక్తదానం, ఉత్సవాలలో స్వచ్ఛంద సేవ, అతివృష్టి, అనావృష్టి, వరదలు, తుఫానులు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నపుడు విరాళాలు సేకరించి తగు సహాయ సహకారాలను అందించడం కూడా ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలుగా ఉన్నాయి. అక్షరాస్యతా కార్యక్రమాల అమలులో భాగస్వాములు కావడం, ఆరోగ్య సూత్రాలను బోధించడం, ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధులపై ప్రజలను చైతన్య పరచడం వంటి కార్యక్రమాల్లోనూ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొంటారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలకు గుర్తింపుగా విశ్వ విద్యాలయాలు ధ్రువీకరణ పత్రాలను అంద జేస్తాయి. ఉద్యోగ నియామకాలు, ఇతర సందర్భాల్లో ఈ సర్టిఫికెట్ లకు విలువ ఉంటుంది. ఆర్మీ, ఎయిర్ ఫోర్సు, మిలటరీ, నర్సింగ్ సర్వీసులలో, పోలీసు, టెలికాం, సమాచార వ్యవస్థ తదితర విభాగాల్లో నియామకాల సందర్భంగా ఎన్ఎస్ఎస్ సర్టిఫికెట్లు ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది. 'నా కోసం కాదు, నీ కోసమే..' అనే దీక్షా నినాదంతో– సేవలు అందించడమే ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల లక్ష్యం. యువతలో సామాజిక స్పృహను కల్పిస్తూ, వారిని సేవా భావంతో ముందుకు నడిపించడం నిరంతర కార్యక్రమంగా కొనసాగాలి. ఈ లక్ష్యంతో ఏర్పాటైన జాతీయ సేవా పథకం ఎంతోమంది విద్యార్థులను ఆకర్షిస్తోంది. ఈ పథకంలో చేరిన వారు క్రమశిక్షణ, సామాజిక చైతన్యం కలిగి జీవితంలో ముందుకు రాణించే అవకాశం ఉంది.

# ప్రపంచ మానవాళికి భరతమాత బోధిస్తున్న పాఠాలు !



వివిధ కులాలు, మతాలు, సంస్కృతులు, భాషలు, యాసలు, వేషధారణలు, ఆహారపు అలవాట్లు లాంటి వైవిధ్యభరిత లక్షణాలు కలిగిన భారతం 'భిన్నత్వంలో ఏకత్వానికి' నిదర్శనంగా ప్రపంచ మానవాళి ముందు నిలుస్తున్నది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా సంపత్తి, ముఖ్యంగా యువశక్తి కలిగిన స్వతంత్ర సువిశాల భారతంలో సమస్యలు ఎన్ని ఉన్నప్పటికీ వాటిని అధిగమించే ప్రయత్నాలను సఫలం చేస్తూనే గత 76 ఏండ్లుగా ప్రజాస్వామ్యానికి పట్టం కట్టి శాంతి సౌభాగ్యాలతో సమైక్యంగా, సగర్వంగా నిలబడి ప్రపంచ మానవాళికి ఓ అద్భుత ఉదాహరణగా ప్రగతి పథాన సాగుతున్నది. రెండు శతాబ్దాలకు పైగా వలస పాలనలో నలిగిన భరతమాత బిడ్డలు ఎన్నో కష్ట నష్టాలను అనుభవిస్తూ, ఓర్చుకుంటూనే ఒకే సాధారణ చరిత్ర, వారసత్వ పునాదుల మీద బలమైన మానవీయ బంధాలతో సమైక్యంగా నిలుస్తున్నది. భారత దేశం లౌకిక భావాలకు పుట్టినిల్లుగా హిందూ, ముస్లిమ్, బౌద్ధ మతాలు స్వేచ్ఛగా గౌరవింపబడుతూనే క్రిస్టియానిటీ, సిక్కిజమ్, జైనిజమ్ లాంటి మైనారిటీ మతాల ప్రజలను కూడా ఏకం చేస్తూ వివిధ మతాలకు/కులాలకు జన్మభూమిగా నిలుస్తున్నది. రాజకీయ కారణాలతో కొన్ని సందర్భాల్లో మత ఘర్షనలు జరిగినప్పటికీ సామాన్య ప్రజల మధ్య మాత్రం ఆత్మీయ సోదర భావం పోషించబడుతున్నది. అతి పురాతన నాగరికతకు పుట్టిల్లుగా భారతీయుల జన్యువుల్లోనే తమ జాతి కుల మతాల విశ్వాసాల పునాదులు చేరి, స్వేచ్ఛగా పాటించబడుతూ, విశ్వ నిర్మాత ఒక అదృశ్య ఆధ్యాత్మిక ఆరాధ్య దైవం ఉన్నాడని దృఢంగా నమ్ముతూ, తప్పు చేస్తే శిక్ష పడుతుందని నమ్ముతూ సన్మార్గంలో నడుస్తూ ప్రపంచ జనాభాకు దారి దీపంగా నిలుస్తున్నది. భారతంలో హిందీ, ఆంగ్లం అనబడే రెండు ప్రధాన భాషలను అత్యధిక ప్రజలు మాట్లాడడంతో పాటు పలు ప్రాంతీయ భాషలకు కూడా చిరునామాగా నిలుస్తున్నది. సువిశాల భారతంలోని అన్ని రాష్ట్రాలు/యూటీలు ఒకే రుపీ కరెన్సీని కలిగి ఉండడం మరో విశేషం.

దేశవ్యాప్తంగా ఒకే రకమైన న్యాయ వ్యవస్థ, విద్యావ్యవస్థ అమలు అవుతున్నది. దేశ పౌరులు ఆనందంతో వారి వారి పండుగలు జరుపుకుంటూ, ఇకరినొకరు గౌరవించుకుంటూనే క్రికెట్ క్రీడను, బాలీవుడ్ సినిమాలు/సినిమా పాటలను వినోద సంపదగా భావిస్తారు. సమానత్వాన్ని గౌరవిస్తూనే ఎన్నికలను పవిత్ర కర్తవ్యంగా భావించి ఓటింగ్ ప్రక్రియలో శాంతియుతంగా పాల్గొనడం నా భారత జనాభా ప్రత్యేకం. అతిథి దేవోభవా భావనలు, బహు సంస్కృతుల సమ్మేళనం, సనాతన ధర్మ ఆచరణలు, యోగా ధ్యాన జీవనశైలి, మూడు ముళ్ళు ఏడు అడుగులు, కుటుంబ విలువలు, అమ్మనాన్నలు ఆది దేవతలుగా పూజించబడడం, భార్యాభర్తల మధ్య అవిభాజ్య సంబంధాలు, విలక్షణ కట్టు బొట్టు, నమస్తే అంటూ ఎదుటి వారిలోని మేధకు గౌరవం ఇవ్వడం లాంటి అనేక ఆచారాలు భారత ఉప ఖండంలోనే కనిపిస్తాయి. సువిశాల సుందర భారతం (28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలు) నాలుగు ప్రధాన భౌగోళిక భాగాలుగా విస్తరించబడి ఉన్నది. తూర్పున పశ్చిమ బెంగాల్, అస్సాం, ఒడిసా, బీహార్ రాష్ట్రాలు ఉండగా పశ్చిమాన మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలు ఉన్నాయి. ఉత్తరాన పంజాబ్, హర్యానా, జె అండ్ కె, ఉత్తరాఖండ్, యూపీ, హిమాచల్ లాంటి రాష్ట్రాలు కొలువుతీరగా, దక్షిణ భారతాన తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కేరళ, కర్నాటక లాంటి రాష్ట్రాలు ఉండగా కేంద్ర భారతాన యంపీ ఇతర రాష్ట్రాలతో సరిహాలను పంచుకొని ఉన్నది. పశ్చిమ భారతంలో సాహిత్యం, సైన్స్, కళలు, ఆర్థికశాస్త్రం, ఆధ్యాత్మిక భావనలు విరాజిల్లుతున్నాయి. ఈ రాష్ట్రాలు వ్యాపార దోరిణికి దూరంగా ప్రభుత్వ ఉద్యోగాలకు తృప్తి పడడం జరుగుతోంది. ఉత్తర భారత ప్రజలు వ్యవసాయం, మిలిటరీ, క్రీడలు, ప్రముఖ సినీ నటీనటులు కలిగిన సినీ పరిశ్రమ లాంటి రంగాలకు ప్రాధాన్యాలను ఇస్తున్నారు. దక్షిణ భారతీయులు శ్రీనివాస్ రామానుజన్ వారసులుగా గణితంతో పాటు ఐటీ రంగాలకు ఆకర్షితులు అవుతున్నారు. దక్షిణ భారత యువత విదేశీ వలసలతో అన్ని ప్రపంచ దేశాల ఐటీ రంగాల ఉన్నత శ్రేణి అధికారులుగా ప్రపంచ ఐటీకి మారుపేరుగా నిలుస్తున్నారు. పశ్చిమ భారతీయులు ధనవంతులుగా పేరు తెచ్చుకునే విధంగా బహుళజాతి కంపెనీల స్థాపకులుగా దేశ ఆర్థిక గమనాన్ని నిర్ణయించే స్థాయికి ఎదిగారు.

2వ ప్రపంచ యుద్ధం తర్వాత ఆర్థిక సరళీకరణ, ప్రైవెటీకరణ, గ్లోబలైజేషన్ విధానాలతో సమగ్ర అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న ప్రపంచ మానవాళికి డిజిటలైజేషన్ రూపంలో భూమిని కుగ్రామంగా మార్చడం, దేశ సరిహద్దులు రేఖలుగా మాత్రమే మిగిలి పోవడం చూస్తున్నాం. నేటి ప్రపంచ యవనికపై రష్యా – ఉక్రెయిన్, ఇజ్రాయిల్ – పాలస్తీనా, తైవాన్ – చైనా ఘర్షణలతో పాటు లెబనాన్, ఇరాన్, నార్త్ కొరియా లాంటి ప్రమాదకర దేశాల దుశ్చర్యలతో ప్రపంచ శాంతి కపోతం భయపడుతున్నది. ఈ యుద్ధాలతో ప్రపంచవ్యాప్తంగా ఆహార/ఇంధన అభద్రత పెరగడంతో పేదరికం తిరోగమన దిశలోకి నెట్టబడుతున్నది. 820 కోట్ల ప్రపంచ జనాభాలో 145 కోట్ల భారతీయులు ప్రత్యేకంగా నిలుస్తున్నారు. భారత జాతి ప్రధాన ప్రత్యేకతలుగా లౌకికవాదం, అందరినీ ఏకం చేస్తున్న భాషలు, సాధారణ కరెన్సీ, కుటుంబ ఐక్యత, సోదర భావనలతో సహజీవనాలు, దాతృత్వ గుణాలు, పాప భీతి, మహిళా సాధికారత, సమ్మిళిత అభివృద్ధి, ఆధ్యాత్మిక భావనలు, ప్రయాణ స్వేచ్ఛ, క్రీడల్లో ఐక్యత, ఒకే రకమైన వినోద రంగాలు, సంగీత సాహిత్య పరిమళాలు, పర్వదిన ఆనందోత్సాహాలు, వ్యవసాయం లాంటి రంగాలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఆసియా ఖండంలో సాహిత్యం, కళలు, మ్యాన్యుఫాక్చరింగ్, సాగు రంగాలు ముందడుగు వేస్తున్నాయి. ఉత్తర అమెరికాలో టెక్నాలజీ, యూరోప్‌లో ఆర్థిక ప్రగతి, ఆఫ్రికాలో క్రీడలు/వినోదం/సంగీతం, ఆస్ట్రేలియాలో వ్యవసాయం, దక్షిణ అమెరికాలో ఖనిజలవణాలు/శక్తి వనరులు మెండుగా ఉన్నాయి. ప్రపంచ యుద్ధాలు, ప్రమాదకర విపత్తులు, వాతావరణ ప్రతికూల మార్పులు లాంటి సవాళ్లు ప్రపంచ మానవాళిని ఏకం చేస్తున్నాయి, భూమిని కుగ్రామంగా మార్చుతున్నాయి. రానున్న ఏండ్లలో ప్రపంచ దేశాల సరిహద్దులు చెరిపివేయబడి ఎవరైనా, ఏదేశానికైనా వీసా లేకుండా ప్రవేశించే విధంగా వసుదైక కుటుంబ భావనలు సాకారం కావచ్చని, దానికి మరికొంత సమయం, సదాలోచన అవసరం అవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఏ దేశమేగినా, ఎందు కాలిడినా, ఏ పీఠమెక్కినా, ఎవ్వరెదురైనా, పొగడరా నీతల్లి భూమి భారతిని, పాడరా భారతి ప్రగతి గీతాన్ని, భిన్నత్వంలో ఏకత్వ సూత్రాన్ని ఏకరువు పెట్టుకుంటూ ప్రపంచ దేశాలకు మానవీయ విలువలు, సరైన జీవనశైలి పాఠాలను భారతీయ నాగరికత బోధిస్తున్నది.

# శిక్షణను సద్వినియోగం చేసుకోండి.

## జీ.ఎం.కొప్పుల వెంకటేశ్వర్లు.

**అగ్నిధార(రామగిరి మండలం):** రామగిరి మండలం రామగుండం అర్జీ త్రీ చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు.సింగరేణిలో విధులు నిర్వహిస్తూ వివిధ అనారోగ్య కారణాల వల్ల మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన, మృతి చెందిన ఉద్యోగుల డిపెండెంట్ లకు కారుణ్య నియామక ఉద్యోగ ఉత్తర్వులను ఇటీవల జారీ చేయడం జరిగినది. అందులో 54 మంది అభ్యర్థులకు మరియు ఇటీవల జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీ పోస్టుల ఖాళీలకు అంతర్గత అభ్యర్థులకు నిర్వహించి ఆటువంటి నియామక పరీక్షలో ఎంపికైన 8 మంది అభ్యర్థులకు స్థానిక ఎం.వి.టి.సి.లో అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు శిక్షణ ఉత్తర్వులను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం అదృష్టమని,సంస్థ ఇచ్చేటటువంటి శిక్షణ ను సద్వినియోగం చేసుకొని, ఉద్యోగంలో చేరిన తరువాత క్రమం తప్పకుండా విధులకు హాజరు కావాలని అన్నారు.అంతే కాకుండా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా విధి నిర్వహణలో ఎలాంటి ప్రమాదాలకు తావివ్వకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ భద్రతతో విధులు నిర్వహించాలని, ఎం.వి.టీ.సి శిక్షణ పూర్తయిన వెంటనే ఇచ్చిన గడువులోపు విధులలో చేరాలని అన్నారు.సింగరేణి సంస్థ లో ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించడానికి ప్రస్తుతం చాలా అవకాశాలు ఉన్నందున,దీనిని సద్వినియోగం చేసుకొని పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు.సింగరేణి సంస్థ ఉద్యోగుల కోసమే కాకుండా వారి కుటుంబ సభ్యుల కోసం కూడా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు.



కావున ప్రతి ఉద్యోగి సింగరేణి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. తదుపరి జి.ఎం. కార్యాలయం నందు నిర్వహించిన కార్యక్రమంలో ఒక అభ్యర్థికి కారుణ్య నియామక పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్వోటుజీఎం బి.సత్యనారాయణ, ఎం.వి.టి .సి.మేనేజర్ మల్లన్న, డి.పి.ఎం.గుర్రం శ్రీహరి,డి.ఎస్.ఇ. శ్రీనివాస్,బోధకుడు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

## ఆర్జీ త్రీ ఏరియా జి.ఎం

**అగ్నిధార(రామగిరి మండలం) :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రామగుండం అర్జీ త్రీ పరిధిలో ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షిస్తూ పర్యావరణాన్ని కాపాడుకోవాలని రామగుండం అర్జీ త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అన్నారు.రామగుండం అర్జీ త్రీ అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని సెంటినరీ కాలనీలో గల సింగరేణి పార్క్ లో సోమవారం నిర్వహించిన స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమంలో భాగంగా రామగుండం అర్జీ త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ వారి ఆదేశాల మేరకు ప్రభుత్వ రంగ సంస్థలలో ఈ నెల 16వ తేదీ నుండి అక్టోబర్ 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఈ పార్కులో వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు కలిసి సుమారుగా 75 వివిధ రకాల పండ్ల మొక్కలను నాటారన్నారు.ఈ క్యాంపెయిన్ లో భాగంగా వివిధ గనులు, విభాగాలలోని కార్యాల యాలు,నివాస ప్రదేశాలతో పా టు పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రరెడ్డి,కోట రవీం దర్ రెడ్డి, ఎస్వోటుజిఎం జి.ం˘ఘుపతి,ఫైనాన్స్ విభాగం ఎజి ఎం పి.శ్రీనివాసులు, పర్యావరణ అధికారి పి.రాజారెడ్డి,అధికారులు జె.రాజశేఖర్, బి.వి .సత్యనారాయణ, ఐలయ్య,రాజేంద్రప్రసాద్, కళ్యాణ్,ఆర్.రాజేశ్వరి, గుర్రం శ్రీహరి,పి.రాజేశం, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.





# పారిశుద్ధ్య కార్యక్రమం




**అగ్ని ధార న్యూస్,( రామగుండం) :** స్వచ్ఛతా హీ సేవా %-% 2024 కార్యక్రమంలో భాగంగా సోమవారం రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ట్రాఫిక్ పోలీస్ అధికారులు , సిబ్బంది కలసి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. చెత్త పేరుకుపోయే ప్రాంతాలను గుర్తించి పరిశుభ్రం చేశారు. పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సి ఐ రాజేంద్ర ప్రసాద్ , ఎ ఎస్ ఐ మల్లేశం తో పాటు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది , నగర పాలక సంస్థ హెల్త్ అసిస్టెంట్ సునీల్ రాథోడ్ , ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్ , ఎం ఐ ఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ తో పాటు పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు కు సహకరించాలి



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:** మహమ్మదాబాద్: నిరుద్యోగ యువత చదువుకోవడానికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని మహమ్మదాబాద్ మండలం నంచర్ల గ్రామ యువకులుతమ గ్రామంలోగ్రంథాలయం ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ కు సోమవారం వినతి పత్రంఅందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంపిటీషన్ ఎగ్జామ్స్కు ప్రిపేర్ అయ్యేందుకు గ్రామంలో వందలాదియువకుల కు ఎంతో మేలు చేకూరుతుందని గ్రామంలో గతంలో గ్రంథాలయం ఉండేదని దాన్ని మళ్లీ పున ప్రారంభం చేయాలనికోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, సుధీర్, సాయి,ప్రవీణ్, సందీప్ చారి, కృష్ణ గ్రామస్తులుతదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేశారు



## హిందూ సంఘాలు ఆగ్రహం

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి):** కల్వకుర్తి పట్టణంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ విషయంలో జరిగిన ఘటనపై తహసిల్దార్ కార్యాలయం ముందు హిందూ సంఘాలు ఆధ్వర్యంలో, నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా గోవింద నామాలు పఠించడం జరిగింది.వారు మాట్లాడుతూ, కోట్లాది మంది ఆరాధించే తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేశారని మండిపడ్డారు. హిందూ ఐక్యవేదిక సంఘం ఆధ్వర్యంలో, ఈ ఘటనకు కారణమైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు దేవునిపై నమ్మకం లేని వారు ట్రస్ట్?లో సభ్యులుగా ఉండటం మూలంగానే జరిగిందని హిందూ సంఘాలు ఆరోపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ట్రస్ట్?ను ఒక వ్యాపార కేంద్రంగా మార్చుకున్నారని ఆరోపించారు. స్వామి వారి ప్రసాదంలో వినియోగించడానికి వీలు లేని పదార్థాలను ఉపయోగించి తిరుమల లడ్డూలను అపవిత్రం చేశారని మండిపడ్డారు. అలాంటి వారిని కఠినంగా శిక్షించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ గిరిధర్ రెడ్డి, రాము, కృష్ణ గౌడ్, సురేందర్ గౌడ్, రాఘవేందర్, నరసింహ ,చందు, మాయని రాజశేఖర్,బాబీ, ఆంజనేయులు, గంగాధర్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



**అగ్నిధార న్యూస్ (సంగారెడ్డి జిల్లా)** జహీరాబాద్ నియోజకవర్గ ము . సెక్టర్ లెవెల్ పోషణ మాసం ప్రోగ్రాం నిర్వహించిన ఇన్చార్జ్ సిడిపిఓ టి అంజమ్మ మరియు సూపర్వైజర్స్ సద్గుణ . ఆరు నెలలు దాటిన పిల్లలకు అన్న ప్రసన్న మరియు రెండున్నర నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమాలు అన్ని చేయడం జరిగింది. మరియు తల్లులు గర్భిణీ స్త్రీలు బాలింతలో కిశోర బాలికలు అందరూ పాల్గొనడం జరిగింది. గాంధీనగర్ అంగన్వాడి కేంద్రం టీచర్ ఎస్ అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించారు.పోషణ మాసం సందర్భంగా ప్రతి ఇంటికి ఆకు కూరలు గురించి తెలియజేయారు.అదే విదంగా చిరు ధాన్యాలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనిత,అంగన్ వాడి టీచర్లు, బుజ్జమ్మ,ప్రమీల,,ఐ షా గౌసియా,రాణి,శ్యామల,,నవీన,పాల్గొన్నారు.

# ఆర్జి త్రీ ఏరియా లో పర్యటించిన సి.హెచ్.పి జీ.ఎం.



**అగ్నిధార(రామగిరి మండలం):** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రామగుండం అర్జీ త్రీ సింగరేణి సంస్థ కార్పొరేట్ సి.హెచ్.పి.ల విభాగం జనరల్ మేనేజర్ తిరుమలరావు రామగుండం అర్జీ త్రీ ఏరియాలో పర్యటించారు.సి.హెచ్.పి.ల విభాగం జనరల్ మేనేజర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారిగా రామగుండం అర్జీ త్రీ ఏరియాలో పర్యటించిన సందర్భంగా జి.ఎం. కార్యాలయంనందు రామగుండం అర్జీ త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు వారిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం రామగుండం అర్జీ త్రీ ఏరియాలోని సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఏరియాలోని సి.హెచ్.పి ద్వారా జరుగుతున్న బొగ్గు రవాణా వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన బొగ్గు రవాణా లక్ష్యాన్ని భద్రతతో సాధించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్వోటుజిఎం జి.రఘుప తి, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర బాబు, ఎస్టేట్స్ అధికారి కె.ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



## రామగుండం నగర మేయర్ బంగి అనిల్ కుమార్

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం) :** ఓపిక , సంయమనం పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రామగుండం నగర మేయర్ బంగి అనిల్ కుమార్ ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి వైద్యులకు సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు అనధికారికంగా విధులకు గైర్హాజరు కావడం , పని వేళల్లో అందుబాటులో ఉండకపోవడం వంటి ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. మూడు రోజుల ముందుగా సమాచారం ఇచ్చినప్పటికీ ఎనిమిది విభాగాలకు సంబందించి కేవల%శీ% మూడు విభాగాల అధిపతులు మాత్రమే సమావేశానికి హాజరు కావడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. విభాగాల అధిపతులు గైర్హాజరీ కావడం , కాంట్రాక్ట్ వైద్యులుగా సేవలందించడానికి ఎవరూ ముందుకు రాక పోవడంతో పని భారంతో ఇబ్బంది పడుతున్నామని సహాయక , సహచర ప్రొఫెసర్లు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి రోగులు , వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి మరింత మెరుగైన సేవలందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై రామగుండం ఎం ఎల్ ఎ రాజ్ ఠాకూర్ , జిల్లా కలెక్టర్ , వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళతానని మేయర్ అన్నారు. ఈ సమావేశంలో మెడికల్ సూపరింటెండెంట్ టి పి దయాళ్ సింగ్ తో పాటు వివిధ విభాగాల అధిపతులు ఎ . అశోక్ , ఆర్ . అరుణ, మరియా శిరోమణి , ఆర్ ఎం ఓ లు రేణుక , చంద్ర శేఖర్ , అశోక్ కుమార్ , అప్పారావు తో పాటు పలువురు సహాయక , సహచర ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారు



## బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు రమేష్ గౌడ్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** వెల్దండ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు రమేష్ గౌడ్ సమావేశంలో మాట్లాడుతూ హైదరాబాదులో హైడ్రా పేరుతో పేద ప్రజలు ఇండ్లు కులగొట్టడం కరెక్టు కాదు అని ఏండ్ల తరబడి కష్టపడి సంపాదించుకున్న డబ్బుతో పేద ప్రజలు ఇల్లు కొనుక్కున్నారు అన్ని పర్మిషన్లతోటే పేద ప్రజలు ఇల్లు కట్టుకున్నారు బ్యాంకులో నుంచి లోను కూడా తీసుకున్నానని మీకు ప్రజలు తెలియజేశారు అయినా కూలగొట్టడం ఎంతవరకు కరెక్టు అని సందర్భంగా తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ ఉన్నప్పుడు హైదరాబాదులో ఇలాంటి ఆటంకాలు జరగలేదు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఇలాంటి అరచకాలకు పాల్పడుతున్నారు పేద ప్రజలు ఇండ్లు కూడగొట్టడం సరైన ది కాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి హెచ్చరిస్తున్నాం తొందర్లో ప్రజలు మీ ప్రభుత్వానికి మీకు తగిన గుణపాఠం చెప్తారని అన్నారు.

# పారిశుద్ధ్య కార్యక్రమం




**అగ్ని ధార న్యూస్,( రామగుండం) :** స్వచ్ఛతా హీ సేవా %-% 2024 కార్యక్రమంలో భాగంగా సోమవారం రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ట్రాఫిక్ పోలీస్ అధికారులు , సిబ్బంది కలసి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. చెత్త పేరుకుపోయే ప్రాంతాలను గుర్తించి పరిశుభ్రం చేశారు. పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సి ఐ రాజేంద్ర ప్రసాద్ , ఎ ఎస్ ఐ మల్లేశం తో పాటు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది , నగర పాలక సంస్థ హెల్త్ అసిస్టెంట్ సునీల్ రాథోడ్ , ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్ , ఎం ఐ ఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ తో పాటు పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

మంగళవారం 24 సెప్టెంబర్ 2024

అగ్నిధార

# గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు కు సహకరించాలి



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:** మహమ్మదాబాద్: నిరుద్యోగ యువత చదువుకోవడానికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని మహమ్మదాబాద్ మండలం నంచర్ల గ్రామ యువకులుతమ గ్రామంలోగ్రంథాలయం ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ కు సోమవారం వినతి పత్రంఅందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంపిటీషన్ ఎగ్జామ్స్కు ప్రిపేర్ అయ్యేందుకు గ్రామంలో వందలాదియువకుల కు ఎంతో మేలు చేకూరుతుందని గ్రామంలో గతంలో గ్రంథాలయం ఉండేదని దాన్ని మళ్లీ పున ప్రారంభం చేయాలనికోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, సుధీర్, సాయి,ప్రవీణ్, సందీప్ చారి, కృష్ణ గ్రామస్తులుతదితరులు పాల్గొన్నారు.

# "సామాజిక సేవలకు గుర్తింపు"

**బెస్ట్ సర్వీస్ ఫర్ సొసైటీ జాతీయ అవార్డు.**

**గోదావరిఖని ప్రాంతవాసి మద్దెల దినేష్.**



**అగ్నిధారన్యూస్, రామగుండం:** పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన సామాజిక కార్యకర్త, ఉద్యమకారుడు నిరంతరం ప్రజా సమస్యల పై పోరాడుతూ ప్రజల హక్కుల సాధన కొరస%శీ% పోరాటం చేస్తూ నిరుపేదలు, నిరాశ్ర యులకు, అనాథలకు, అభాగ్యులకు అన్నర్తులకు అండగా ఉంటున్న ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ బెస్ట్ సర్వీస్ ఫర్ సొసైటీ జాతీయ అవార్డ్ 2024 కు ఎంపికయ్యారనీ పేర్కొన్నారు. మద్దెల దినేష్ వామపక్ష భావాలు కల్గిన వ్యక్తి కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తూ ప్రజాసంఘాల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తు ప్రజా పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తూ ఎన్నో సమస్యలను పరిష్కరించిన ఉద్యమకారుడని, ఒక వైపు ప్రజా ఉద్యమాలు చేస్తూ మరో వైపు సామాజిక సేవలు చేస్తూ ముందుకు సాగుతున్న మద్దెల దినేష్ సేవలను ఉద్యమాలను వాటి ఫలితాలను బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ కమిటీ ఆప్ ఇండియా గుర్తించిన జాతీయ అధ్యక్షులు నాల్ల రాధాకృష్ణ బాదె వెంకటేశం తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ గుర్తించి అవార్డుకు సహకరించిన వారికి మద్దెల దినేష్,ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఆంధ్ర ప్రదేశ్ లోని తిరుపతిలో అక్టోబర్ 6, 2024 ఆదివారం రోజున అవార్డ్ సెలక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్ అయిన బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా బెస్ట్ సర్వీస్ ఫర్ సొసైటీ జాతీయ అవార్డ్ ఎంపికైన సందర్భంగా ప్రధానం చేస్తారని మద్దెల దినేష్ తెలిపారు.

# నోబెల్ విద్యార్థులకు బహుమతులు ప్రధానం

**బహుమతులు ప్రధానం చేసిన శ్రీ చిన్న జీయర్ స్వామి.**

**విద్యార్థులకు ప్రశంసలు, ఉపాధ్యాయులకు అభినందనలు.**




**అగ్నిధారన్యూస్ హైద రాబాద్// పెద్దపల్లి:** ప్రజ్ఞా వికాస్ ట్రస్మ ఆధ్వర్యంలో నిర్వహించబడిన వ్యాస రచన పోటీలో పేగడ అక్షర , చిత్రలేఖన పోటీలో హస్మిత జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సోమవారం రోజు హైదరాబాదు ముచింతల్లో శ్రీ చిన్న జీయర్ స్వామి చేతులు మీదుగా తీసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ చిన్న జీయర్ స్వామి మాట్లాడుతూ ప్రతి తల్లి తన బిడ్డను నవమాసాలు మోసి ఎన్నో కష్టాలను ఓర్చుకొని జన్మనిచ్చి ఓ కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది అన్నారు. బిడ్డకు జన్మనిచ్చేటప్పుడు ప్రతి తల్లికి పునర్జన్మే అదే విధంగా మనం జన్మించినప్పటి నుండి మనం కడతేరే వరకు చివరికి మనల్ని తనలో ఐక్యం చేసుకునేది మనం పుట్టిన భూమి ఇంతటి ఘనత కలిగిన మాతృభూమి ఋణం తీర్చుకునే అదృష్టాన్ని ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి సామాజిక జీవనం కొనసాగించాలి అన్నారు.మంచి సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర చాలా కీలకమైనది.ఎందుకంటే నేటి విద్యార్థులే భావి సమాజ నిర్మాతలు. అలాంటి విద్యార్థులు చరవాణిలా వ్యాపకంలో పడిపోయి చెడు వ్యసనాలకు లోనవుతున్నారు అన్నారు. సమాజం ఎటువైపు ప్రయాణిస్తుందో చూస్తే భయభ్రాంతులను కలిగిస్తుంది అన్నారు. దానికి తోడు తల్లిదండ్రులు తమ పిల్లల చెడు ప్రవర్తనలను చెడు అలవాట్లను గమనించకపోవడం, తగిన మాటలతో మందలించకపోవడం వల్లనే వీటంతటికి కారణాలు అవుతున్నాయి అన్నారు.ఇలాంటి దృశ్యాలు దృష్టిలో పడితే, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తీసుకొని చక్కదిద్దే ప్రయత్నం చేస్తూ మాతృభూమిపై కృతజ్ఞత భావాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా నోబెల్ స్కూల్ విద్యార్థులను ఆశీర్వదించారు. ఉపాధ్యాయులను అభినందించారు.

# ఏఐటియుసి ని బధనాం చేస్తే చూస్తూ ఊరుకోము.



**అగ్నిధార(రామగిరి మండలం):** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రామగుండం అర్జీ త్రీ పరిధిలో గల ఓసిపి టు లో ఏఐటియుసి నాయకులు మాట్లాడుతూ సింగరేణి వాటా స్థూల లాభాల నుండి కాకుండా నికర లాభాల నుండి మాత్రమే ప్రకటిస్తారు.ఈసారి గత ప్రభుత్వం లాగా కాకుండా పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో స్థూల లాభం ప్రకటిస్తూ కంపెనీ కార్మికుల వెల్ఫేర్ కోసం, ఇన్వెస్ట్మెంట్ కోసం,ప్రతి సంవత్సరం లాగానే కొంత పక్కన పెట్టి నికర లాభాలను ప్రకటించడం వలన బాగా చదువుకున్నమని కొంతమంది పనికి రాని సంఘాలు వారి ఉనికి కోసం కార్మికులను పక్క దారి పట్టించే ప్రయత్నం లో గందరగోళం సృష్టిస్తున్నారు. ఏఐటీయూసీ ని బదనాం చేయడానికి 4701 కోట్ల లాభాలు వస్తే 2412 కోట్లు ఏ విధంగా ప్రకటించి 796 కోట్ల రూపాయల్ని కార్మికులకు లాభాలు పంచుతారు అని దుష్ప్రచారం చేస్తున్నారు.అప్పుడు 68 మిలియన్ టన్నులు తీస్తే 4000 కోట్లు వచ్చినాయి ఇప్పుడు 70.2 మిలియన్ టన్నులు తీస్తే 3 మిలియన్ టన్నుల కు ఎంత తేడా ఉంది.రెండు కోట్ల రూపాయలు అధికంగా ఎలా వస్తాయి.ఒక్కసారి ఆలోచించాలని కార్మిక సోదరులకు విజ్ఞప్తి చేశా రు. ఈ కార్యక్రమంలో ఏఐటయూసీ ఫిట్ సెక్రటరీ వెంకట్ స్వామి ఆధ్వర్యంలో బ్రాంచ్ సెక్రటరీ ఎం ఆర్ సి రెడ్డి అధ్యక్షతన గేట్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ గేట్ మీటింగ్ లో డిప్యూటీ సెక్రటరీ వైవి రావు సెంట్రల్ సెక్రెటరీ జూపాక రామచందర్ కార్మిక సోదరులను ఉద్దేశించి మాట్లాడుతూ లాభాల వాటా పంపిన విషయంలో కొన్ని కార్మిక సంఘాలు వాళ్ల ఉనికి కోసం ఏదో ఒకటి మాట్లాడి కార్మికుల్లో గందరగోళం సృష్టించి ఉనికి చాటు కోవాలనే ప్రయత్నంలో ఏఐటీయూసీ ని బదనాం చేయాలని లేనిపోని విషయాలను కార్మికులకు చెప్పడం జరుగుతుంది ఆ విషయాలపై వైవి రావు గారు మాట్లాడుతూ లాభాల మొట్ట మొదటి సారిగా సింగరేణిలో పుట్టించిన ఘనత ఏఐటీసీదని అది కేవల్ మహేంద్ర గారి కృషితో వచ్చిందని అదేవిధంగా ఇప్పటివరకు దానిని ఏ ప్రభుత్వము ఉన్న ఏ యూనియన్ ఉన్న వాళ్లు ఒకటి రెండు శాతం పెంచుకుంటూ 33 శాతం వరకు కార్మికులకు ఇవ్వడం జరుగుతుంది. గత పది సంవత్సరాలుగా టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్కసారి కూడా కార్మిక నాయకుని తో మాట్లాడి లాభాల వాటా ప్రకటించక పోవడంతో ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం యూనియన్ల తో మాట్లాడి ప్రకటించడం వలన జీర్ణించుకోలేని సంఘాలు కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయి.ఈ కార్యక్రమంలో అమర కొండ పోచం,దొంతుల శ్రీనివాస్,ఎం.వెంకటేశ్వర్లు, అనపర్తి రాజయ్య,నరేష్, లక్ష్మణ్,రామ్మూర్తి, సదానందం,పోలు కనకయ్య ఏఐటీయూసీ నాయకులు,కార్యకర్తలు, శ్రేయోభిలాషులు మరియు కార్మిక సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్దుబాటు ఉత్తర్వులను రద్దు చేయాలి





**టీటీయూ జిల్లా అధ్యక్షులు అనిల్ ,కార్యదర్శి ప్రతాపరెడ్డి.**

**అగ్నిధారన్యూస్, వనపర్తి జిల్లా:** ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం జారీచేసినమార్గదర్శకాలు ప్రాథమిక పాఠశాలల పట్ల ప్రభుత్వ అసంబద్ధ వైఖరి అని స్పష్టంగా కనబడుతుంది టిటియు వనపర్తి జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్ ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డిలు అన్నారు.కాలం చెల్లిన 2015 నాటి రేషనలైజెషన్ నిబంధనలను అమలు చేయాలని పదిమంది విద్యార్థులకి ఒక ఉపాధ్యాయుడు, 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు అనే నిబంధనతో ప్రాథమిక పాఠశాలలో బోధన సమర్థవంతంగా ఎలా బోధించాలో అధికారులే సూచించాలి, బడుగు బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య ను దూరం చేసే కుట్రలో భాగంగానే ఈ ఉత్తర్వులు ఇచ్చినట్లుగా భావించవలసి వస్తుంది. ఏది ఏమైనా ఇలాంటి ఉత్తర్వులు ఇవ్వడం బాధాకరం.ప్రాథమిక పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయ పోస్టును, తరగతి కి ఒక ఉపాధ్యాయుణ్ణి మంజూరు చేయాలి.అప్పుడే ప్రాథమిక పాఠశాలలు బలోపేతం అవుతాయన్నారు. అదే విధంగా జూన్ మాసంలో బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్ట్ లను డియస్సీ ఫలితాలను వెంటనే ప్రకటించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని వారు ఇరువురు డిమాండ్ చేశారు.

# దోషులను కఠినంగా శిక్షించాలి

**వెంకటేశ్వర స్వామి లడ్డు అపవిత్రం.**

**బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్ కుమార్ డిమాండ్.**



**అగ్నిధార గన్నేరువరం,:** గన్నేరువరం,మండలం కేంద్రంలో సోమవారం రోజు ,బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్ కుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అత్యంత పవిత్రమైన తిరుమల,తిరుపతి పుణ్యక్షేత్రంలో, భక్తజన కోటి ప్రజలు మహా ప్రసాదంగా భావించే వెంకటేశ్వర స్వామి సన్నిధిలో తయారయి లడ్డు, నాణ్యత లోపంతో పాటు, లడ్డు తయారీలో జంతువుల కొవ్వు వాడినట్లు, వార్తలు వస్తున్న నేపథ్యంలో జరిగిన సంఘటనపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నానన్నారు. తిరుపతి,వెంకటేశ్వర స్వామి లడ్డు అపవిత్రం చేసి కోట్లాదిమంది ప్రజల మనోభావాలు దెబ్బతీసిన దోషులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఒక పత్రిక ప్రకటనలో డిమాండ్ చేస్తున్నానన్నారు.

# కాంపౌండ్ వాల్ కు భూమి పూజ




**అగ్నిధార న్యూస్ మంథని :** మంథని శివారులో గల మాతా శిశు సంరక్షణ కేంద్రం కాంపౌండ్ వాల్ నిర్మాణానికి మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రు రమా సురేష్ రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు.కలెక్టర్ కృషల్ ఫండ్ బ్యాలెన్స్ కింద 36 లక్షల అంచనా విలువతో 300 మీటర్ల కాంపౌండ్ వాల్ నిర్మాణం చేయనున్నారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సహాయ సహకారాలతో మాతా శిశు ఆరోగ్య కేంద్రం కాంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమి పూజ చేశామని మున్సిపల్ చైర్ పర్సన్ రమా సురేష్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ సూపరింటెండెంట్ ఎన్.మనోహర్ మున్సిపల్ ఎం.డి శాహబాజ్ మంథని సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్క్ షాప్ కరపత్రాలు ఆవిష్కరణ



**అగ్నిధారన్యూస్ (గోదావరిఖని).** అఖిల భారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్) రాష్ట్ర సమితి నిర్ణయం మేరకు అక్టోబర్ 27,28 తేదీలలో గోదావరిఖని కేంద్రంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్క్ షాప్ నిర్వహించడం జరుగుతుంది. ఈ వర్క్ షాప్ కరపత్రాలను గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి ,రాష్ట్ర సహాయ కార్యదర్శి లింగం రవి ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కపురి సూర్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఏఐవైఎఫ్ ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే చందర్ జన్మదిన వేడుకలు

**నియోజకవర్గంలో చందర్ పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు**




**అగ్నిధారన్యూస్ (గోదావరిఖని)** రామగుండం మాజీ శాసనసభ్యులుచందర్ జన్మదిన వేడుకలు రామగుండం నియోజకవర్గం లో ఘనంగా జరిగాయి. కేటీఆర్ స్ఫూర్తి తో గిఫ్ట్ ఏ స్మైల్ లో భాగంగా తమ జన్మదినం సందర్భంగా పెద ప్రజలకు సేవ కార్యక్రమాలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి పిలుపు మేరకు రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో బిఆర్ఎస్ శ్రేణులు కోరుకంటి అభిమానులు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. 5 ఇంక్లయిన్ బిఆర్ఎస్ పార్టీ పట్టణ కమిటి అధ్యక్షుడు బోడ్డు రవీందర్ ఆధ్వర్యంలో అమ్మపరివార్ ఆశ్రమంలో అన్నదానం కార్యక్రమం చెపట్టారు. తిలక్ నగర్ బిఆర్ఎస్ పార్టీ పట్టణ కమిటి ఆధ్వర్యంలో స్దానిక న్యూ అశోక్ టాకిస్ వద్ద పేదలకు అన్నదానం నిర్వహించారు. గంగనగర్ పట్టణ కమిటి అధ్యక్షుడు అచ్చే వేణు ఆధ్వర్యంలో స్దానిక పోచమ్మ దేవాలయం వద్ద అన్నదానం చేసారు. బిఆర్ఎస్ యువజన నాయకుడు సాయి కృష్ణ (చింటూ) పేద కుటుంబాలకు చెందిన వృద్ధ మహిళలకు జ్యోతి గాంధీ పౌండేషన్ నిర్వహణ పాకెట్ మనీ అందించారు. 37 వ డివిజన్ లో అంగన్ వాడి సెంటర్ కు నాయకులు చెలకపల్లి శ్రీనివాస్ తాటికంటి తిరుపతి మహేందర్ రెడ్డి లు కూలర్ ను అందించారు. బిఆర్ ఎస్ పార్టీ మహిళా నాయకురాలు ముద్దసాని సంధ్యా రెడ్డి ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ అసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు పండ్లను, బ్రెడ్ ను పంపిణీ చేశారు.బిఆర్ఎస్ పార్టీ లక్ష్మి నగర్ పట్టణ అధ్యక్షుడు నూతి తిరుపతి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అధే విధంగా గోదావరిఖని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో కేక్ కట్ చేసి స్వీట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో కార్పోరేటర్లు బోడ్డు రజిత రాకం లత దామెదర్ పాముకుంట్ల భాస్కర్ నాయకులు జే.వి.రాజు నారాయణదాసు మారుతి, బొబ్బిలి సతీష్, మాదాసు రామమూర్తి, పర్లపల్లిరవి, ఆడప శ్రీనివాస్ ,చల్లా రవీందర్ రెడ్డి కౌటం బాబు, నీరటి శ్రీనివాస్, తోకల రమేష్, సట్టు శ్రీనివాస్ యాసర్ల తిమ్మెతి ,పోలాడి శ్రీనివాస్, రావుబోయుని రాజశేఖర్, ఇరుగురాళ్ల శ్రావన్, కర్రి ఓదేలు ,నాగరాజు ,జడ్సన్ బుర్ర వెంకన్న, రామరాజు భాను ప్రసాద్ ,మహేందర్ పోట్ట కనుకయ్య నరసింహ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, పద్మ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ చైర్మన్ పదవి ఎవరిని వరించేనో..?




**అగ్నిధారన్యూస్, సుల్తానాబాద్:** రాజకీయ పార్టీలకు సుదీర్ఘకాలం కష్టపడి పనిచేసి కష్టకాలంలో ఉన్న పార్టీలను అధికారంలోకి తీసుకురావడంలో ఆయా పార్టీల నాయకుల కార్యకర్తల కృషి అంత ఇంత కాదు. అధికారంలోకి వచ్చిన పార్టీకి, మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో, వందలాది మందిని నామినేటెడ్ పోస్టుల్లో నియమించే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. కష్టకాలంలో పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు నామినేట్ పోస్టులు ఇవ్వడంలో ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేల జిల్లా మంత్రుల సిఫారసు ఫైనల్,మంత్రులు,ఎమ్మెల్యేలు కష్టపడ్డ వారికి పదవులు ఇప్పించుకోవడం మామూలే. కష్టపడ్డ నాయకులు ఎక్కువైనప్పుడు నామినేట్ పోస్ట్ ఎవరికి ఇవ్వాలో ఎవరికి ఇవ్వద్దో తెలియక ఎమ్మెల్యేలకు, మంత్రులకి పెద్ద తలనొప్పి కూడా ఉంటుంది.కష్టపడ్డా నాయకులు నామినేటెడ్ పోస్ట్ తమదంటే తమదేనని, ఎవరికి వారు తమ ప్రయత్నాలు చేసుకుంటారు. రాష్ట్రవ్యాప్తంగా నామినేటెడ్ పోస్టుల పర్వం కొనసాగుతుంది. పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, జూలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులను, ఇటీవల భర్తీ చేయగా సుల్తానాబాద్ మార్కెట్ చైర్మన్ పదవి కోసం పోటీ పెరిగినట్లు తెలుస్తుంది. సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందోనని ఆశవహులు ఎదురుచూస్తున్నారు. పోటీపడే నాయకులు పార్టీలో సీనియర్లు, శాసనసభ్యులకు అత్యంత సన్నిహితులు కావడం శరమాములే. ఇకపోతే శాసనసభ ఎన్నికలకు ముందు చేరికలలో భాగంగా ఒకరిద్దరిని కాంగ్రెస్ లోకి ఆహ్వానించే ముందు భవిష్యత్తులో మార్కెట్ చైర్మెన్ పదవి హామీఇస్తేనే కాంగ్రెస్ పార్టీలో చేరుతానని చెప్పడంతో వారి చేరికకు పార్టీ పెద్దలు ఓకే అన్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. అయితే పెద్దపల్లి జిల్లాలో సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి పోటీ నెలకొని ఉండడంతోనే ఎవరికి వారే ఈ పదవి కోసం ఆశావాహులు ఎమ్మెల్యే చుట్టూ తిరుగుతూ విజ్ఞప్తులు చేస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అనుకుంటున్నారు. శాసనసభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ పెద్దలు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు అన్యాయం చేయమని హామీ ఇవ్వడంతో కొంతమంది ఉద్యమకారులు కూడా ఈపదవి కోసం పోటీ పడుతున్నట్లు తెలుస్తుంది.పెద్దపల్లి, జూలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నియమించడంతో సుల్తానాబాద్ మండలంలోని కాంగ్రెస్ నాయకులు కొత్త ఆశలు చిగురుస్తున్నట్లు చెప్పకనే చెప్పవచ్చు. మరి ఈ సుల్తానాబాద్ మార్కెట్ చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో ఒకటి రెండు రోజుల్లో తేలనున్నట్లు సమాచారం.

# కార్మికులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

### చిత్రపటాలకు పాలాభిషేకం.

అగ్నిధారన్యూస్ (గోదావరిఖని) రామగుండం నియోజకవర్గ ప్రజల కోసం ప్రాణానికి సైతం లెక్కచేయకుండా ఆపద వస్తే అండగా నిలబడే నాయకులు ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దిటి బాలరాజు అన్నారు .సింగరేణి చరిత్రలో మొదటిసారిగా సింగరేణి కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులకు 5000 రూపాలు దసరా బోనస్ ప్రకటించడం చాలా సంతోషం గా ఉందని ఐ ఎన్ టి సి నాయకులు జనగాం శ్రీనివాస్ ఓరుగంటి కృష్ణ అధ్యక్షతన 5 ఇంక్లైన్ కాంట్రాక్ట్ కార్మికులు,మహిళా కార్మికులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,ఉపముఖ్య మంత్రి బట్టి విక్రమార్క,మంత్రి శ్రీధర్ బాబు,ఎంపీ వంశీ కృష్ణ,రామగుండ%శీ% ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ల చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరికింది.కాంగ్రెస్ సీనియర్ నాయకులు దీటి బాలరాజ్ ముఖ్య అతిధిగా పాల్గొని వారు మాట్లాడుతూ.. గత టిఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడు కూడా కాంటాక్ట్ కార్మికులను పట్టించుకున పాపన పోలేదని,కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులకు ఇవాళ దసరా బోనస్ ప్రకటించడం చాలా సంతోషమని ఇంకా రాబోయే కాలంలో మన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ ఈ ప్రాంత అభివృద్ధి తో పాటు,కార్మికుల,కర్షకుల,అభివృద్ధి కి ఎల్లపుడు కృషి చేస్తారని తెలిపారు. మహిళా కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమం లో మహిళా కాంట్రాక్టు కార్మికులు కాంగ్రెస్ నాయకులు ఉలంగుల రమేష్,,మోయిను సన్నీ,తుమ్మల చంద్రశేఖర్ గౌడ్,చిగురు సాయి,అజీమ్ అధిక సంఖ్యలో కాంటాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

# అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలి





### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.

**అగ్నిధారన్యూస్,పెద్దపల్లి, సెప్టెంబరు-23:** ప్రజా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని స్థానిక సంస్థల జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి పాల్గొన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి సంబంధిత శాఖలకు జిల్లా కలెక్టర్ కేటాయించి ప్రజల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (27) దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన పి.ఊపేందర్ ఎస్సీ కార్పొరేషన్ కింద సబ్సిడీపై ఆటో మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఈడీ ఎస్సీ కార్పొరేషన్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన ఎం.మల్లా రెడ్డి తన ఇంటిని దౌర్జన్యంగా కూలగొట్టి ఆక్రమించుకోవడానికి తనను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పెద్దపల్లి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కు రాస్తూ వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. రామగుండం లోని కృష్ణ రామగుండం లోని కృష్ణ నగర్ కాలనీవాసులు ఏ.రాజేశం కృష్ణానగర్ లో ఎన్టిపిసి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న గల్లీలో 30 అడుగుల రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణం చేశారని, దీనివల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇట్టి అక్రమ నిర్మాణాన్ని జిల్లా టాస్ఫోర్స్ కమిటీ , రామగుండం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా రామగుండం మున్సిపల్ కమిషనర్ కు రాస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.పెద్దపల్లి మండలం హనుమంతునిపేట గ్రామానికి చెందిన ఏ.లలిత తనకు 50% ఫిజికల్ డిసేబిలిటి ఉందని, తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓదెల మండలం గుంపుల గ్రామానికి చెందిన ఏ.బుచ్చమ్మ తమకు గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ లో ఉచిత విద్యుత్తు రావడం లేదని, కరెంట్ బిల్లు కూడా అధికంగా వస్తుందని, తన భర్త అనారోగ్యంతో ఉన్నారని, అధిక బిల్లు చెల్లించలేకపోతున్నామని తమకు గృహ జ్యోతి పథకం వర్తింపజేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఎస్ఈ ట్రాన్స్ కో అధికారికి రాస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

### చారి టబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండలం మాదాయ పల్లి గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. డాక్టర్ అఖిల్ డాక్టర్ అనిల్ మరియు కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో 225మందికి డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ బిపి షుగర్ జలుబు దగ్గు వైరల్ ఫీవర్ వంటి వ్యాధుల బారిన వారికి మందులు అందజేసీ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో,గ్రామ మాజీ సర్పంచ్ హైమావతి రామస్వామి, ఉప సర్పంచ్ జయమ్మ శ్రీనివాస్,బయ్య గౌరయ్య, బయ్య తిరుపతయ్య, గుళ్ళ శేఖర్, భూషమోని గెలవలయ్య, ముదిగొండ పెంటయ్య, యాదయ్య, కొత్తూరు శేఖర్, శీలం శీను, భూషమోని చంద్రమౌళి, సత్యం గౌడ్, సుల్తాన్ గౌడ్, ముదిగొండ సాయిలు, కడ్తాల రామస్వామి, బుచ్చిబాబు, అఖిల్, తుడుం శ్రీశైలం, ముదిగొండ వినోద్ కుమార్, ముదిగొండ సతీష్, ముదిగొండ శ్రీకాంత్, పత్రికా మిత్రులు ఆశా వర్కర్లు గ్రామ పెద్దలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అచ్చ వేణు ఆధ్వర్యంలో చందర్ జన్మదిన వేడుకలు



అగ్నిధారన్యూస్ (మార్కండేయ కాలనీ/ గోదావరిఖని) బిఆర్ఎస్ పార్టీ గంగానగర్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎండి హెచ్ డబ్ల్యూ ఎస్ నిస్సహాయ పిల్లల కేంద్రం, పోచమ్మ దేవాలయం దగ్గర పారిశ్రామిక ప్రాంతంలోని అనాథలకు అన్నదానం, పండ్లు పంపిణీ చేసి కేక్ కట్ చెయ్యటం జరిగింది. కార్యక్రమం పట్టణ కమిటీ అధ్యక్షులు అచ్చే వేణు అధ్యక్షతన జరగగాఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు తోకల రమేష్, పొలాడి శ్రీనివాస్ రావు, యాసర్ల రాజుకుమార్, పంజా అశోక్, సట్టు శ్రీనివాస్, దూట శేషగిరి, నూతి రాజకుమార్, ఓజ్జా కొమురయ్య,సకినాల ప్రతాప్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం



### ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి మండలంలోని పంజుగుల గ్రామానికి చెందిన చినవర్తి ఎరుకలి ఎల్లమ్మ అనారోగ్యంతో బాధ పడుతూ మరణించడం జరిగింది. ఈ విషయాన్ని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ దృష్టికి ధారమోని గణేష్ ద్వారా తీసుకువెళ్లాగా మృతురాలు ఎల్లమ్మ కుటుంబానికి తమ ఉప్పల ట్రస్టు ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ కల్వకుర్తి అధ్యక్షుడు దారమోణి గణేష్, గ్రామ పెద్దలు ఇప్ప సాయిబాబు, శ్రీను,చిన్న సాయిలు, ఎల్లయ్య , మురళి తదితరులు పాల్గొన్నారు.

## కివీస్‌పై 63 రన్స్ తేడాతో నెగ్గిన శ్రీలంక

**గాలె:** న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో శ్రీలంక విజయం సాధించింది. 63 రన్స్ తేడాతో గాలె టెస్టులో విక్టరీ కొట్టింది. లంక స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య రెండో ఇన్నింగ్స్‌లో కీలకమైన అయిదు వికెట్లు తీసి కివీస్‌ను దెబ్బతీశాడు. 275 రన్స్ టార్గెట్‌తో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కివీస్.. కేవలం 211 రన్స్‌కు ఆలౌటైంది. ఇవాళ అయిదో రోజు ఆట ఆరంభమైన 15 నిమిషాల్లోనే చివరి రెండు వికెట్లను న్యూజిలాండ్ కోల్పోయింది. రచిన్ రవీంద్ర ఒంటరి పోరాటం చేసి 92 రన్స్ చేశాడు. సుడులు తిరుగుతున్న గాలె పిచ్‌పై కివీస్ బ్యాటర్లు పరుగులు రాబట్టడంలో తడబడ్డారు. ఇదే పిచ్‌పై గురువారం రెండో టెస్టు ప్రారంభంకానున్నది.

# పనుల్లో వేగం పెంచండి

### స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని యజ్ఞంలా పూర్తి చేయాలి.
### గ్రామాల్లో మంచి నీటి సహాయకులు.
### నెలలోపు శిక్షణ పూర్తి.
### తాగు నీటి మోటర్ పాడైతే అదే రోజు మరమ్మత్తు.
### అధికారులకు మంత్రి సీతక్క దిశా నిర్దేశం.





**అగ్నిధారన్యూస్, హైదరాబాద్:** పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖలో విభాగాల వారిగా పనుల్లో వేగం పెంచాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. విభాగాల వారిగా జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. సచివాలయంలో సోమవారం నాడు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సెర్ప్ సీఈఓ దివ్యా దేవ రాజన్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ అనితా రామచంద్రన్, స్పెషల్ కమీషనర్ షఫిఉల్లాతో కలిసి మంత్రి సీతక్క సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. .బీఆర్ఎస్ హయంలో పెండింగ్ ఉంచిన బిల్లులను త్వరలో చెల్లిస్తామని చెప్పారు. ఆయా విభాగాల్లో కొనసాగుతున్న పనుల పురోగతిని తెలుసుకున్నారు. విభాగాల వారిగా నూతన పనులకు కార్యచరణ సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. హెఓడీలతో సమీక్ష అనంతరం డీఆర్ డీఓ,అడిషన్ డీఆర్డీఓ , డీపీఓ లతో మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామల్లో స్వచ్ఛ దనం, పచ్చదనం కార్యక్రమానికి కొనసాగింపుగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అధికారులంతా జవాబుదారిగా వ్యవహరించానలి సూచించారు. జిల్లాల్లో ప్రతి రోజు చేపట్టిన కార్యక్రమాల వివరాలను అన్ లైన్ లో ఎంట్రి చేయాలన్నారు. రాబోయే పది రోజుల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా కొనసాగించాలని ఆదేశాలు జారిచేసారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో స్థానిక ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం పెంచాలని కోరారు. జాతీయ స్థాయిలో స్వచ్ఛతా హీ సేవా విభాగంలో రాష్ట్రాన్ని అగ్ర స్థానంలో నిలిపేలా కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫారా విషయంలో నూతన ఒరవడికి తమ ప్రభుత్వం నాంది పలికిందని తెలిపారు. ప్రతి గ్రామంలో గ్రామ మంచినీటి సహాయకుడి ని నియమించి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 15 జిల్లాల్లో 60 ప్రాంతాల్లో శిక్షణ కొనసాగుతుందని..ఈ నెల లోపు అన్ని గ్రామాలకు సహాయకులను నియమించి శిక్షణ పూర్తి చేస్తామన్నారు. తాగునీటి నాణ్యతను నిర్వహించడంతోపాటు బోర్లు పాడైతే అదే రోజు మరమ్మత్తులు జరిగేలా, పైపులు లీకైతే సరిచేసేలా గ్రామాల్లో మంచినీటి సహాయకులు కృషి చేస్తారని తెలిపారు.

మంగళవారం 24 సెప్టెంబర్ 2024
అగ్నిధార

# పెళ్లి అనగానే హెచ్చరికలు మొదలయ్యాయి!



బాలీవుడ్ ఇండస్ట్రీలో అనేక సంవత్సరాలు పాటు స్టార్ హీరోయిన్గా కెరియర్ను కొనసాగించిన వారిలో మోస్ట్ బ్యూటిఫుల్ నటిమని కరీనా కపూర్ ఒకరు. ఈమె కెరియర్ మంచి ఊపులో ఉన్న దశలోనే బాలీవుడ్ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు కలిగిన నటుడు అయినటువంటి సైఫ్ అలీ ఖాన్ ను వివాహం చేసుకుంది. ఇక వివాహం తర్వాత వీరి జీవితం ఎంతో అన్యోన్యంగా ముందుకు సాగుతుంది. తాజాగా కరీనా ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. అందులో పెళ్లి విషయం బయటకు వచ్చాక ఎవరు ఎలాంటి సలహాలు ఇచ్చారు అనే దానిపై ఈమె స్పందించింది. తాజా ఇంటర్వ్యూలో కరీనా కపూర్ మాట్లాడుతూ ... సైఫ్ అలీ ఖాన్ తో పెళ్లి అనే విషయం బయటకు రాగానే నా చుట్టూ ఉన్న ప్రపంచం అందులో ఉన్న జనాలు నాకు అనేక సలహాలను ఇవ్వడం మొదలు పెట్టారు. కొందరైతే పెళ్లి చేసుకుంటే కెరీర్ ముగిసినట్టే , ఇక నీకు సినిమా అవకాశాలు రావు , నువ్వు ఇండస్ట్రీలో అక్కడే ఆగిపోతావు అని భయపెట్టారు. కానీ నేను వారి మాటలను ఏ మాత్రం లెక్క చేయలేదు. కెరియర్ ముగిసిపోవాలి అని రాసి ఉంటే కచ్చితంగా ముగిసిపోతుంది. అది పెళ్లి చేసుకోవడం వల్ల ముగిసిపోతుంది అంటే నేను అస్సలు ఆ మాటలను పట్టించుకోలేదు. నిజానికి అయితే నేను పెళ్లి తర్వాతే చాలా రిస్కు చేశాను. పెళ్లికి ముందు చేసిన సినిమాల కంటే రిస్క్ ఎక్కువగా ఉన్న సినిమాలు పెళ్లి తర్వాత చేశాను. దానితో ఎంతో మంది పెళ్లి తర్వాత కెరియర్ క్లోజ్ అవుతుంది అన్న దాన్ని నేను పక్కన పెట్టి పెళ్లి చేసుకున్నాను. ఆ తర్వాత కూడా నేను ఎన్నో సినిమాలలో నటించి అద్భుతమైన విజయాలను అందుకొని ఇప్పటికీ కూడా కెరియర్ను మంచి జోష్లో ముందుకు సాగిస్తున్నాను అని కరీనా కపూర్ తాజాగా చెప్పుకొచ్చింది.

## సినిమాని సినిమాలాగే చూడండి



సినిమాని సినిమాలాగే చూడండి అని హీరో సూర్య సినీప్రియులకు సందేశమిచ్చారు. ఏదైనా సినిమా రిలీజ్ అయితే బాక్సాఫీసు వద్ద దాని రికార్డు ఎలా ఉంది, రేటింగ్ ఎంత దాని తప్పొప్పులపై రివ్యూలు చూసి అప్పుడు సినిమా చూస్తున్నారని దీనివల్ల ఆ సినిమాను ఎంజాయ్ చేయలేకపోతున్నారని హీరో సూర్య అభిప్రాయపడ్డారు. ఇటీవల 'మెయ్యజగన్' ఈవెంట్లో పాల్గొన్న సూర్యమాట్లాడుతూ " సినీ ప్రియులు ఎవరైనా సరే.. సినిమాని ఒక సినిమాలా చూడండి. కథ, కథనం, మ్యూజిక్, ఎమోషన్స్, కామెడీ.. ఇలా ప్రతీదాన్ని ఎంజాయ్ చేయండి. బాక్సాఫీస్ కలెక్షన్స్ గురించి ఏమాత్రం ఆలోచించవద్దు. ఒక అభిమానిగా సినిమాని సెలబ్రేట్ చేసుకోండి. ఆద్యంతం ఎంజాయ్ చేయండి అంతేకానీ.. దానిలో ఉన్న తప్పొప్పుల గురించి రివ్యూ చేయడంపై దృష్టి పెట్టకండి " అని కోరారు. ప్రస్తుతం సూర్య మాటలు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. సూర్య చెప్పిన మాటలు సరైనవేనని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడున్న రోజుల్లో రివ్యూలు, బాక్సాఫీస్ కలెక్షన్సను మాత్రమే సినీప్రియులు పరిగణలోకి తీసుకుంటున్నారని.. ఆవిధంగా అసలైన వినోదాన్ని ఆస్వాదించలేకపోతున్నాడని పలువురు సోషల్ మీడియా వేదికగా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## 'పుష్ప ది రూల్' నుంచి అల్లు అర్జున్ కొత్త పోస్టర్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఫ్యాన్స్కు క్రేజీ అప్డేట్ వచ్చింది. మరో 75 రోజుల్లో 'పుష్ప ది రూల్' కౌంట్డౌన్ షురూ కానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్ను పంచుకుంది. అల్లు అర్జున్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'పుష్ప 2'. పుష్ప సినిమాకు సీక్వెల్గా వస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 06న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఇక 'పుష్ప 2' విడుదలకు ఇంకా 75 రోజులు మాత్రమే ఉన్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ప్రస్తుతం క్లైమాక్స్ షూటింగ్ జరుపుకుంటుంది ఈ చిత్రం. ఇక క్లైమాక్స్ అనంతరం శరవేగంగా పోస్ట్ ప్రోడక్షన్ పనులు స్టార్ట్ చేయబోతున్నట్లు తెలిపింది. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రష్మిక కథానాయికగా నటిస్తుండగా ఫహద్ ఫాజిల్, సునీల్, అనసూయ, జగదీశ్ ప్రతాప్, ధనుంజయ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రూ.500 కోట్ల భారీ బడ్జెట్తో మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి.



# ఈ మాటలు స్వయంగా చెప్పాలనుకున్నా..

### అచ్చ తెలుగులో మాట్లాడి ఆకట్టుకున్న జాన్వీ కపూర్..

తెలుగు అభిమానులకు బాలీవుడ్ స్టార్ నటి జాన్వీ కపూర్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రత్యేక వీడియోను ఇన్స్టా వేదికగా షేర్ చేశారు. ప్రస్తుతం జాన్వీ.. ఎన్టీఆర్ 'దేవర' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఆ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ అనూహ్యంగా రద్దైంది. దీంతో చిత్ర బృందంతోపాటు, అభిమానులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఇక ఈ ఈవెంట్లో ప్రేక్షకులు, అభిమానులకు చెప్పాలనుకున్న మాటలను జాన్వీ ఈ వీడియో ద్వారా చేరవేశారు. ఇందులో జాన్వీ అచ్చతెలుగులో మాట్లాడటం అందరినీ ఆకట్టుకుంటోంది. 'అందరికీ నమస్కారం. నన్ను ఇంతగా ఆదరిస్తూ, నాపై ఇంత ప్రేమను చూపిస్తున్నందుకు తెలుగు ఆడియన్స్కు ధన్యవాదాలు. నన్ను జానూ పాప అని పిలుస్తున్న ఎన్టీఆర్ అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు. నన్ను మీరు సొంత మనిషిలా భావించడం చాలా సంతోషాన్నిస్తోంది. మా అమ్మ మీకు ఎంత ముఖ్యమో నాకు తెలుసు. మా అమ్మకు కూడా మీరందరూ అంతే ముఖ్యం. అలాగే నాకు కూడా. నన్ను ఇంతలా సపోర్ట్ చేస్తున్న మీరందరూ గర్వపడేలా ప్రతిరోజూ కష్టపడతాను. దేవర నా మొదటి అడుగు. శివ సర్, ఎన్టీఆర్ సర్ నన్ను ఈ సినిమాకు ఎంపిక చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. మా ప్రయత్నం మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను. ఈ ప్రయత్నంలో నాకు ప్రతి అడుగులోనూ సపోర్ట్గా నిలిచినందుకు దేవర టీమ్ ప్రతి ఒక్కరికీ పేరుపేరునా నా ధన్యవాదాలు' అని తెలిపారు. ఈ మాటలు తాను స్వయంగా చెప్పాలనుకున్నట్లు జాన్వీ తెలిపారు. అయితే, ఈ సారి అలా కుదరలేదన్నారు. త్వరలోనే అందరినీ కలుస్తానన్నారు. ప్రస్తుతానికి ఇది తన తరఫు నుంచి అభిమానులకు చిన్న మెసేజ్ అంటూ వీడియోకు క్యాప్షన్ ఇచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్గా మారింది. వీడియోలో జాన్వీ లంగా ఓణీ కట్టుకుని అచ్చ తెలుగులో మాట్లాడుతూ ఆకట్టుకున్నారు. జూనియర్ ఎన్టీఆర్, కొరటాల శివ కాంబోలో వస్తున్న మూవీ దేవర. రెండు భాగాలుగా ఈ మూవీ తెరకెక్కనున్నది. తొలిపార్ట్ ఈ నెల 27న విడుదల కానున్నది. ఈ క్రమంలో మూవీ మేకర్స్ ఆదివారం హైదరాబాద్ హైఐసీసీలో ప్రీ రిలీజ్ ఈవెంట్ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే, ప్రి రిలీజ్ ఈవెంట్కు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పరిమితికి మంచి అభిమానులు రావడంతో తోపులాట చోటు చేసుకున్నది. ఈవెంట్ కోసం ఏర్పాటు చేసిన వేదిక ఏమాత్రం సరిపోలేదు. ఒక్కసారిగా అభిమానులంతా లోపలికి వెళ్లేందుకు ఎగబడ్డారు. ఆరుబయటే వేలాది మంది అభిమానులు ఉండిపోయారు. మరో వైపు లోపల కార్యక్రమానికి వచ్చిన అతిథులు సైతం కూర్చునేందుకు వీలు లేకుండాపోయింది. పలువురు అభిమానులు ఏర్పాట్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఫర్నీచర్, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. పోలీసులు వెంటనే స్పందించి.. అభిమానులను బయటకు పంపించి వేశారు. అభిమానులను అదుపు చేయడం అసాధ్యమని భావించడంతో పోలీసులు హోటల్ నిర్వాహకులు, పోలీసులు ఈవెంట్ని క్యాన్సిల్ చేయాలని నిర్ణయించారు. తమ అభిమాన నటీనటులను చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు నిరాశతో వెనుదిరిగారు.



# శివగామి పాత్రను స్ఫూర్తిగా తీసుకున్నా



### స్వాగ్ భామ రీతూ వర్మ

హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా కథను నమ్మి సినిమాలు చేసే యాక్టర్లలో ముందుంటాడు శ్రీ విష్ణు ఈ టాలెంటెడ్ యాక్టర్ కాంపౌండ్ నుంచి వస్తోన్న తాజా చిత్రం స్వాగ్ హసిత్ గోలి దర్శకత్వం వహిస్తున్నాడు. పెళ్లి చూపులు ఫేం రీతూ వర్మ హీరోయిన్గా నటిస్తుండగా.. దక్షా నగార్కర్ మరో కీలక పాత్రలో నటిస్తోంది. స్వాగ్లో రీతూవర్మ వింజామర వంశపు రాణి రుక్మిణి దేవి పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే రాజసం ఉట్టిపడే రాయల్ లుక్ను విడుదల చేయగా నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రం అక్టోబర్ 4న గ్రాండ్గా విడుదల కానున్న నేపథ్యంలో ప్రమోషన్స్లో బిజీగా ఉంది స్వాగ్ టీం. ఈ సినిమాతో రీతూవర్మ శ్రీవిష్ణుతో కలిసి పదకొండేళ్ల (ప్రేమ ఇష్క్ కాదల్) తర్వాత సిల్వర్ స్క్రీన్పై మెరువబోతుంది. కాగా ప్రమోషనల్ ఇంటర్వ్యూలో రీతూవర్మ సినిమా గురించి మాట్లాడుతూ.. ఈ సినిమా ముందుగా అనుకున్న ప్రకారం గతేడాది విడుదల కావాల్సింది. పదేండ్ల తర్వాత వీఎఫ్ఎక్స్ పనుల కారణంగా కొంత ఆలస్యమవుతూ వచ్చింది. మేమిద్దరం (శ్రీవిష్ణు, రీతూవర్మ) చాలా సిగ్గపడే వ్యక్తులం. ఇద్దరి మధ్య ఉన్న కామన్ థింగ్ అదే. కానీ చాలా ఏండ్లుగా అతన్ని చూస్తున్నా. ఇండస్ట్రీలో తనకంటూ ఒక సముచిత స్థానాన్ని ఏర్పరచుకున్నాడు. సినిమాలో నా పాత్రకు బాహుబలిలో రమ్యకృష్ణ పోషించిన రాజమాత శివగామి పాత్రను స్ఫూర్తిగా తీసుకున్నానని చెప్పుకొచ్చింది రీతూ వర్మ. ఆడ మగ అందరూ అక్టోబర్ 4న థియేటర్లకు వచ్చేయండి.. అంటూ ఇప్పటికే శ్రీవిష్ణు టీం రిలీజ్ చేసిన వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది. చారిత్రక నేపథ్యం ఉన్న శ్వాగణిక వంశం కథ నేపథ్యానికి కామెడీ బ్యాక్డ్రాప్ను జోడిస్తూ.. వస్తోన్న ఈ మూవీని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. వివేక్ కూచిబొట్ల సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. స్వాగ్కు వివేక్ సాగర్ మ్యూజిక్, బ్యాక్గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. మేకర్స్ మరోవైపు ఇప్పటికే స్వాగ్ ప్రపంచానికి మరింత రాజసం.. అంటూ షేర్ చేసిన దక్షా నగార్కర్ లుక్ కూడా సోషల్ మీడియాలో రౌండప్ చేస్తోంది. ఇక బాబా సెహగల్ పాడిన సింగరో సింగ సాంగ్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com